





GST NO: 36ACPPF9587L2ZM    TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం    తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 98 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శుక్రవారం 20 జూన్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్





### పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు

# అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు

- బనకచర్ల ప్రాజెక్టు అంశంలో అభ్యంతరాలను వివరించాం
- కేంద్రమంత్రి పాటిల్‌ను కలిసిన సిఎం రేవంత్, ఉత్తమ్

**న్యూఢిల్లీ,జూన్19సమయజ్యోతి**

బనకచర్ల ప్రాజెక్టు అంశంలో తమకు ఉన్న అభ్యంతరాలను కేంద్రమంత్రికి వివరించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు పట్ల తెలంగాణ ప్రజల్లో తెలంగాణ రైతుల పట్ల ఆందోళన ఉందని, గోదావరి కృష్ణ నుంచి 1500 టీఎంసీల వాటర్ తెలంగాణకు బ్లాంకెట్ ఎన్‌వోసి ఇస్తే దాని ద్వారా కోటిన్నర ఎకరాలకు నీళ్లు అందించగలుగుతామని అన్నారు.

మిగతా 2లో...



### కేబినేట్ నిర్ణయించకుండా

# పనులు చేపడతారా

- సిఎం రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా
- కాళేశ్వరం కూడా కేబినేట్ నిర్ణయం మేరకే జరిగింది
- ప్రాజెక్టులు కట్టడం వేరు..అవినీతి చోటు చేసుకోవడం వేరు
- అందుకే కాళేశ్వరం అవినీతిపై సిబిఐ విచారణను కోరుతున్నాం
- సిఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపి ఈటెల రాజేందర్ వ్యాఖ్య

**హైదరాబాద్,జూన్19సమయజ్యోతి**

సుందిళ్ళ, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులు రీ డిజైన్ లో కేసీఆర్ చేర్చారు.. అవినీతి జరిగితే విచారణ జరపండి, విచారణ జరిగినా చర్యలు తీసుకుంటారాని నమ్మకం లేదు, అందుకే సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తుననామని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. ప్రాజెక్టులు రాజకీయ పార్టీలకు ఏటిఎంలుగా మారాయని ఎంపీ ఈటల తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు.

మిగతా 2లో...





# వేగంగా రైతుభరోసా నిధుల బదిలీ

- రైతు ఖాతాల్లో నేరుగా నగదు జమ
- 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు

02 లో

## నిధులు జమ కాకుంటే అధికారులను కలవండి



**హైదరాబాద్,జూన్19సమయజ్యోతి**

రైతు భరోసా నిధులు జమకాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉండి.. బ్యాంకు అంకౌట్లలో డబ్బులు పడని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

మిగతా 2లో...

## మెట్రో రెండోదశకు అనుమతించండి

- హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యకు ఇదే పరిష్కారం
- 76.4 కిలోమీటర్ల పొడవైన
- మెట్రో ఫేజ్-2 డిపిఆర్ అందించాం
- కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి వినతి
- బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తోనూ చర్చలు

**న్యూఢిల్లీ,జూన్19సమయజ్యోతి**

మెట్రో రెండోదశకు వెంటనే అనుమతులు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు.

మిగతా 2లో...

# బేసిన్ల మీద అవగాహన లేకుంటే ఎలా

- దేవాదుల ఏ బేసిన్ కింద ఉందో కూడా తెలీదా
- బనకచర్లపై పక్కదోవ పట్టించేలా మాట్లాడుతారా
- సిఎం తీరుపై మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్,జూన్19(తెలంగాణ సమాజం):**

ఆంధ్రా జల దోపిడీని అడ్డుకుని.. తెలంగాణ పొలాలకు నీళ్లు పారియ్యమని, అక్రమ ప్రాజెక్టును ఆపమని అడిగితే.. అది చేతగాక అడ్డుఅదుపు లేకుండా అబద్దాల ప్రవాహాన్ని నిన్న సీఎం పారించే ప్రయత్నం చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అసలు విషయం మాట్లాడకుండా.. విషయాన్ని పక్కదోవ పట్టించారు. మా ఎంపీ రవిచంద్ర బాగా ఆర్గ్యూ చేశారు. బనచకర్ల ప్రాజెక్టును ఆపేందుకు ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా సహకరిస్తుంది. దీన్ని గాంధీ భవన్‌గా, రాజకీయ వేదికగా మార్చకు. అసెంబ్లీ ఏర్పాటు చేసి ఏకగ్రీవ తీర్మానం చేయ్. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లు అని మా ఎంపీ స్పష్టంగా చెప్తే సీఎం మాత్రం రాజకీయ వేదికగా మార్చారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. బహుషా బ్యాగుల మీద ఉన్న నాలెడ్జ్.. బేసిన్ల మీద లేదని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు విమర్శించారు. బేసిన్ల మీద బేసిక్ నాలెడ్జ్ లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు మీద నిన్న రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు రాష్ట్ర ప్రజలు చూశారు. గత కొంతకాలంగా బనకచర్లను అడ్డుకోండని మేం మాట్లాడితే.. బొడిగుండుకు, మోకాలికి ముడిపెట్టినట్టుగా నిన్న రేవంత్ రెడ్డి మాట్లాడారు. అసలు విషయాన్ని పక్కనపెట్టి సొల్లు వాగుడు వాగారు ముఖ్యమంత్రి. బేసిన్ల గురించి బేసిక్ నాలెడ్జ్ లేకుండా మాట్లాడారు. మిగతా 2లో

### మన సంస్కృతిని మన భాషలోనే

# అర్థం చేసుకోగలం

- విదేశీ బాషలను దూరం పెట్టే రోజులూ వస్తాయి
- పుస్తకావిష్కరణ కార్యక్రమంలో అమిత్ షా వ్యాఖ్య

**న్యూఢిల్లీ,జూన్19సమయజ్యోతి**


మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మాతృభాషలోనే దీనిని అర్థం చేసుకోగలమని అన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు.

2లో



# నేడు ప్రపంచ శరణార్థుల దినోత్సవం

ప్రపంచ శరణార్థుల దినోత్సవం ప్రతి ఏట జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. ప్రపంచంలోని శరణార్థుల గురించి అవగాహన కలిపించడంకోసం ఈ దినోత్సవంను జరుపుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత శరణార్థుల అంశం ప్రధాన సమస్యగా మారడంతో శరణార్థుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి 1950, డిసెంబర్ 14న ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థని ఏర్పాటు చేసింది. ప్రపంచంలో అనేక దేశాల్లో నిరంతరం జరుగుతున్న యుద్ధాలు, అంతర్గత పోరాటాల ఫలితంగా అనేకమంది ప్రజలు నిర్వాసితులై శరణార్థులుగా మారుతూనే ఉన్నారు. ఈ పరిణామాల కారణంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2000, డిసెంబరు 4న సమావేశమై ప్రతి సంవత్సరం జూన్ 20న "అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం" జరపాలన్న 55/76 తీర్మానాన్ని ఆమోదించింది. 2001లో తొలిసారి జరిగిన అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవాన్ని 1951లో జరిగిన శరణార్థుల సదస్సు 50వ వార్షికోత్సవంగా గుర్తించారు. శరణార్థులందరినీ గౌర వించడం, వారి గురించి అవగాహన పెంచడం, వారికి మద్దతు తెలపడం వంటి కార్య క్రమాలు జరుగుతాయి. ఇతర అంతర్జాతీయ దినోత్సవాల మాదిరిగా ప్రపంచ శరణార్థుల దినోత్సవం సంద ర్భంగా ఉత్సవాలు జరుపుకునే రోజు కాదని, శరణార్థులు ఎదుర్కొంటున్న కష్టాలు, అమానవీయ పరిస్థితులు, వాటి వెనుక ఉన్న కారణాలు, వీటన్నిటిని గురించి ప్రపంచ మానవ సమాజానికి తెలియజేసి అవగాహన కల్పించేందుకు ఈ సందర్భాన్ని వినియోగించు కోవాలన్న ఉద్దేశ్యంతో ఐక్యరాజ్య సమితి, ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ ('యునైటెడ్ నేషన్స్ హైకమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ - యుఎన్‌హెచ్‌సిఆర్) పిలుపుమేరకు ప్రతి సంవత్సరం జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక పౌర సంఘాలు ప్రపంచ శరణార్థుల దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. యుద్ధం, హింస కారణంగా వారివారి స్వస్థలం నుండి పారిపోయి వచ్చిన వారిని ఆదరించి వారికి బతుకుదెరువు చూపెట్టాలని ప్రజలకు తెలుపుతున్నారు.స్థానికంగా జరుగుతున్న ప్రపంచ శరణార్థుల దినోత్సవ కార్యక్రమానికి హాజరు కావడం, ప్రపంచ శరణార్థుల దినోత్సవ వీడియోలను చూడటం వాటికి ఇతరులకు పంపించడం, సోషల్ మీడియాలో శరణార్థులపై అవగాహన పెంచడం కార్యక్రమాలు జరుగుతాయి.




## నిధులు జమ కాకుంటే అధికారులను కలవండి

## రైతులకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్,జూన్19సమయజ్యోతి

రైతు భరోసా నిధులు జమకాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉండి.. బ్యాంకు అంకౌట్లలో డబ్బులు పడని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్తగా భూముల యాజమాన్యం పొందిన రైతులకు కూడా రైతు భరోసాకు అర్హులవుతారని ప్రభుత్వం తెలిపిన విషయం విధితమే. జూన్ 5వ తేదీ వరకు భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులు కూడా ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం పరిగణిస్తుంది. క్రమంలో ప్రభుత్వం నిర్ణయించిన జూన్ 20వ తేదీ వరకు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవాలని భావించిన వారు సంబంధిత ఏఈవో దగ్గరకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందనీ తెలిపారు.. జూన్ 20వ తేదీ వరకు అలా అప్లయ్ చేసుకున్న వారికి మాత్రమే రైతు భరోసా సాయం అందుతుందని అధికారులు తెలిపారు. తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రైతు భరోసా నిధులను విడుదల చేస్తోంది. తాజాగా మరో రూ. 1189.43 కోట్లను విడుదల చేసింది. ఐదు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ చేసిన సర్కార్.. గురువారం నాడు మరికొంత మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసింది. అధికారిక సమాచారం ప్రకారం.. గురువారం నాడు 4,43,167 మంది రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు జమ చేసింది. ఇప్పటి వరకు 62.47 లక్షల మంది రైతుల ఖతాల్లో రూ. 6404.7 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. ఇక భూమి పరంగా చూసుకుంటే.. 106 లక్షల ఎకరాకు పంట సహాయం అందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

మొదటి పేజీ తరువాయి

# మన సంస్కృతిని మన భాషలోనే అర్థం చేసుకోగలం

మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనుగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా ఈ విధంగా మాట్లాడారు. ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి మూలాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలని అమిత్ షా పిలుపునిచ్చారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.

## బేసిన్ల మీద అవగాహన లేకుంటే ఎలా

మొదటి పేజీ తరువాయి

ఆయనకు బహుషా బ్యాగుల మీద మంచి నాలెడ్జ్ ఉన్నట్టుంది కానీ బేసిన్ల మీద నాలెడ్జ్ లేదని నిన్నటి పీపీటీతో స్పష్టమైపోయింది. పీపీటీ పెట్టి మరి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. దీంతో రాష్ట్రం పరువు పోయింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కనీసం బేసిక్ నాలెడ్జ్ లేకుండా ఉంటారా..? అని రాష్ట్ర ప్రజలు నవ్వుకునే పరిస్థితి ఏర్పడింది. సీఎం ఇంత అజ్ఞానంగా ఉంటాడా..? అని దేశం ముందు పరువు పోయే పరిస్థితి వచ్చింది. సీఎంకు, ఉత్తమ్‌కు కనీస జ్ఞానం లేకపోవడం ఈ రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం. రేవంత్ రెడ్డి అంతులేనటువంటి అజ్ఞానంతో, మూర్తీభవించిన మూర్ఖత్వంతో నిన్న మాట్లాడారు. విషాదం ఏంటంటే.. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందని రేవంత్ రెడ్డి అడుగుతాడు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలియదు.. బనకచర్ల ఏ బేసిన్‌లో కడుతున్నారో ఆయనకు తెలియదు. అసలు సీఎం రేవంత్ ఏం చేస్తున్నట్లు.? బనకచర్ల మీద ఏపీ ఆరు నెలల నుంచి పని చేస్తూ.. కేంద్ర ఆర్థిక మంత్రికి ఉత్తరాలు రాస్తూ.. కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కలుస్తూ ముందుకు పోతుంటే.. సీఎం అమాయకంగా బనకచర్ల ఏ బేసిన్‌లో ఉంది అని అడుగుతున్నాడు. దీని బట్టి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రేవంత్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమైపోతోంది అని హరీశ్‌రావు అన్నారు. ÷శివంత్ రెడ్డి లాగా నేను విజ్ఞతను పొగొట్టుకునే వ్యక్తిని కాదు. రేవంత్ రెడ్డి కుసంస్కారి. సంస్కారం లేని వ్యక్తి. మాట్లాడితే సొల్లు.. ఎదుటి వారిమీద బురద జల్లడం, నోటికొచ్చినట్టు వదరుబోతు తనంతో మాట్లాడడం. మాకేమో కొన్ని ఎథిక్స్ ఉన్నాయి. క్యారెక్టర్‌తో ఉన్నాం. ఉద్యమాలు, పోరాటాల నుంచి వచ్చినోళ్లం.. నీలాగా అడ్డమైన తొక్కుళ్లు తొక్కుకుంటూ వచ్చినోళ్లం కాదు. ఈయనకు బేసిక్స్ తెలియవు.. బేసిన్స్ తెలియవు అని నేను ఉట్టిగా అనలేదు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందని సామాన్య రైతును అడిగినా, స్కూల్ పిల్లగాడిని అడిగినా.. గోదావరి మీద కట్టింద్రు అని చెప్తరు. సీఎం రేవంత్‌కు దాని మీద జ్ఞానం లేకపోవడం శోచనీయం. రేవంత్ రెడ్డి తెలుసుకోవాల్సింది ఏందంటే.. బూతులు తెలుసుకున్నంత సులువు కాదు.. బేసిన్ల గురించి తెలుసుకోవడం. బూతులు మాట్లాడినంత సులువు కాదు.. బేసిన్ల గురించి అర్థం చేసుకోవడం రేవంత్ రెడ్డి గారు. నీ చిల్లర రాజకీయాలతో నీ అజ్ఞానాన్ని బయట పెట్టుకుని రాష్ట్రం పరువు తీశావు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

మొదటి పేజీ తరువాయి

# వేగంగా రైతుభరోసా నిధుల బదిలీ

హైదరాబాద్,జూన్19సమయజ్యోతి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసాను రికార్డు వేగంతో పంపిణీ చేస్తోంది. కేవలం తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు ఆర్థిక శాఖ ఏ రోజుకారోజు నిధులను విడుదల చేస్తుంది. వ్యవసాయ శాఖ అందించిన జాబితాల ప్రకారం రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తోంది. అయితే, 16వ తేదీన రైతు నేస్తం వేదికగా స్వయంగా సీఎం రైతు భరోసా చెల్లింపులను ప్రారంభించారు. నాలుగు రోజుల్లోనే రికార్డు వేగంతో 6,405 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించింది. గురువారం సాయంత్రం నాటి వరకు రాష్ట్రంలో ఐదు ఎకరాల్లోపు భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమయ్యాయి. ఇక, ఇప్పటి వరకు మొత్తం 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమైనట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. మొత్తం ఒక కోటి ఆరు లక్షల (1.06 కోట్లు) ఎకరాల భూములకు పెట్టుబడి సాయం అందింది. ఒక ఎకరంలోపు 24.22 లక్షల మంది రైతులు, రెండెకరాల లోపు 17.02 లక్షల మంది, మూడు ఎకరాల లోపు 10.45 లక్షల మంది, 4 ఎకరాల లోపు 6.33 లక్షల మంది, 5 ఎకరాల లోపు 4.43 లక్షల మంది ఇప్పటి వరకు రైతు భరోసా పథకం ద్వారా లబి&ధ పొందారు. వానాకాలం పంటలకు సరైన అదునులో ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం తమ ఖాతాల్లో జమ కావటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం రైతు భరోసా నిధులను వేగంగా చెల్లింపులు చేస్తున్న తీరు కొత్త రికార్డు నెలకొల్పింది.

మొదటి పేజీ తరువాయి

# పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు

బనకచర్ల ప్రాజెక్టు పట్ల తెలంగాణ ప్రజల్లో తెలంగాణ రైతుల పట్ల ఆందోళన ఉందని, గోదావరి కృష్ణ నుంచి 1500 టీఎంసీల వాటర్ తెలంగాణకు బ్లాంకెట్ ఎన్‌వోసి ఇస్తే దాని ద్వారా కోటిన్నర ఎకరాలకు నీళ్లు అందించగలుగుతామని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారు. పోలవరం , బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.. బనకచర్ల లింక్ ప్రాజెక్టు చట్ట విరుద్ధమని చెప్పామని.. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర జలశక్తి మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. బనకచర్లపై త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామని కేంద్రమంత్రి చెప్పారని, గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు తెలంగాణకు బ్లాంకెట్ ఎన్‌వోసి ఏపీ రాసివ్వాలని కోరామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలపాలన్నారు. అప్పుడే తాము బనకచర్లపై ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తప్పనిసరి అని, ఇప్పటి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు లభిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులు వేగవంతంగా నిర్మాణం చేయాలనుకున్నా.. ప్రాజెక్టులు అనుమతులు నెమ్మదిగా అవుతున్నాయని మంత్రి అన్నారు. అయితే తమ అభ్యంతరాలపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అన్ని విధాలుగా హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మూసి పునర్జీవం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారన్నారు. తెలంగాణకు అన్యాయం జరగకుండా అన్ని విధాల చర్యలు చేపడతామని చెప్పారన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంలో వీలైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

మొదటి పేజీ తరువాయి

# మెట్రో రెండోదశకు అనుమతించండి

న్యూఢిల్లీ,జూన్19సమయజ్యోతి

మెట్రో రెండోదశకు వెంటనే అనుమతులు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఢిల్లీలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో ఆయన నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సమావేశం అయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-2 అవసరం ఎంతో ఉందని కేంద్ర మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు సీఎం. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. మెట్రో ఫేజ్-2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా కొనసాగడంతో పాటు రహదారులపై రద్దీ కూడా తగ్గుతుందని వెల్లడించారు. అలాగే, సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర మంత్రి ఖట్టర్ కు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినట్లు గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-ఎఎ ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపి జితేందర్ రెడ్డి, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ భేటీ అయ్యారు. గంటపాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ 2వ వార్షికోత్సవం సందర్భంగా ఆవిష్కరించే 'తెలంగాణ రైజింగ్ 2027' కార్యక్రమం వివరాలను సీఎం టోనీ బ్లెయిర్‌కు అందించారు. రైతులు, యువత, మహిళలు ఇలా అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి, మానవ అభివృద్ధి సూచికల మెరుగుదలకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. కోర్ అర్బన్, పెరి-అర్బన్, గ్రామీణ మండలలాతో మైక్రోప్లానింగ్‌కి సంబంధించిన విషయాలను టోనీతో పంచుకున్నారు. అనంతరం టోనీ బ్లెయిర్ మాట్లాడుతూ.. అభివృద్ధి అజెండా స్థిరత్వ సూత్రాల ద్వారానే సాధించవచ్చున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి అంశాలపై టోనీ ÷-లబెయిర్ ప్రత్యేక ఆసక్తి కనబరిచారని సీఎం కార్యాలయం పేర్కొంది. తెలంగాణ రైజింగ్ విజన్ డెవలప్‌మెంట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం, టోనీ ÷-లబెయిర్ ఇన్‌స్టిట్యూట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు ప్రకటించింది.

మొదటి పేజీ తరువాయి

# కేబినేట్ నిర్ణయించకుండా పనులు చేపడతారా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ సందర్భంగా కేబినెట్‌లో ఆమోదం లేకుండా ఏమి జరగదు.. ఆయన మంత్రి వర్గంలో ఉన్నవారే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు, ఈ విషయం వారిని అడగవచ్చని సూచించారు. కేసీఆర్ మొదలు పెట్టిన ప్రాజెక్ట్ అని నేను చెప్పాను, అది ఎప్పుడు మొదలయ్యిందో తెలుసుకోవాలని పేర్కొన్నారు. అయితే, మొదట పిల్లర్లు రిపేర్ చేసి నీళ్లు ఇచ్చే పని పెట్టుకోండని రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ప్రాజెక్టులు కట్టడం తప్పు కాదు, వాటి పేరుతో అక్రమాలు చేయడం తప్పు అన్నారు. కేబినెట్ ఆమోదం లేకుండా ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందా అని ప్రశ్నించారు. ప్రతి నిర్ణయం కేబినెట్ రాటిఫికేషన్ జరుగుతుంది.. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని డాక్యుమెంట్స్ మీకు పంపిస్తాను అని చెప్పుకొచ్చారు. మీ డిపార్ట్‌మెంటో ఏ నిర్ణయం తీసుకోవాలి అనుకున్నా.. కేబినెట్ లో పెట్టండి అని కేసీఆర్ చెప్పే వారు ఇది నిజం కాదంటే నేను దేనికైనా సిద్ధం అని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మించడం, అవినీతి వేరువేరుగా చూడాలి.. ప్రాజెక్ట్ నిర్మించాలి కానీ వాటిని అడ్డం పెట్టుకొని సంపాదించడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తుందని బీజేపీ ఎంపీ ఈటల చెప్పారు.ఇక, తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిందని ఈటల రాజేందర్ తెలిపారు. నేను జైళ్లకు పోయిన, నా రక్తం చిందిది, పెట్రోల్ మంటల్లో యువత కాలిపోయింది, ఫలితంగా వచ్చిన తెలంగాణలో ప్రాజెక్ట్ కట్టాలా వద్దా? అని ప్రశ్నించారు. అనేక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే మొదలు పెట్టారు కానీ పూర్తిచేయలేదు.. జలయజ్ఞంలో భాగంగా ప్రాణహిత- చేవెళ్ల ఐదేళ్లలో పూర్తి చేసే ప్రాజెక్టేనా కదా?.. ఎందుకు పూర్తి చేయలేదన్నారు. కమిషన్ త్వరగా పూర్తి చేయాలి అవినీతి నిగ్గు తేల్చాలి.. బీజేపీ అయితే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తుంది.. బీజేపీ ప్రాజెక్ట్స్ కట్టడానికి వ్యతిరేకం కాదు.. అధికారం అడ్డం పెట్టుకొని టెండర్లు లేకుండా పనులు పంచుకోవడం తప్పు అని ఎంపీ ఈటల పేర్కొన్నారు.

# నిర్మల్ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల అనియమాలపై స్పందన

## నవ తెలంగాణ విద్యార్థి సంఘం చట్టబద్ధ చర్యల కోసం డిమాండ్

నిర్మల్, జూన్ 2025:

నిర్మల్ జిల్లాలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను పాటించకుండా విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తక్షణ చర్యల కోసం డిమాండ్ చేశారు."పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ అనుమతులు లేకుండానే హాస్టళ్లు నడుపుతూ, అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇది తల్లిదండ్రులకు తీవ్రమైన ఆర్థిక భారం కావడంతో పాటు విద్యార్థుల విద్యా హక్కులను హరిస్తోంది," అని తులసీరామ్ తెలిపారు. విద్యా శాఖ అధికారులు అవినీతితో కూడిన విధానాలను అనుసరిస్తూ, నిబంధనలు పాటించని పాఠశాలలకు అనుమతులు ఇచ్చే దుస్థితిని ఆయన తీవ్రంగా విమర్శించారు.ఇతర శాఖల అనుమతులు లేకుండానే హాస్టళ్లు నడుపుతున్న పాఠశాలలు విద్యార్థులను కనీస సౌకర్యాలు లేని భవనాల్లో ఉంచడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. హాస్టల్స్ లో నాణ్యమైన భోజనం, వైద్య సహాయం, విద్యా వాతావరణం, భద్రత వంటి అవసరాలు నిర్లక్ష్యం చేయబడుతున్నాయని పేర్కొన్నారు.అలాగే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ, తల్లిదండ్రులపై ఆర్థిక భారం పెడుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా ఇంచార్జ్ గణేష్, నిర్మల్ టౌన్ అధ్యక్షుడు ఆస్తం దేవన్న తదితరులు పాల్గొన్నారు.ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కారం



చేపట్టాలనే ఉద్దేశంతో విద్యార్థి సంఘం పక్షాన పల్లపు తులసీరామ్ గారు ఈ ప్రకటన జారీ చేశారు.

# హనుమకొండలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజేతలకు సన్మానం

మొదటి పేజీ తరువాయి

హనుమకొండ, జూన్ 21, 2025:



అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2025 సందర్భంగా హనుమకొండలోని శ్రీ రామకృష్ణ ధ్యాన మందిర్ లో ప్రత్యేకంగా నిర్వహించిన "సూర్య నమస్కార మారథాన్" పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. వివిధ వయసులవారైన యోగా అభ్యాసకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సీనియర్ల విభాగంలో మొదటి బహుమతిని మాధవి, రెండవ బహుమతిని శ్వేత, మూడవ బహుమతిని శ్రీకళ గెలుచుకున్నారు. జూనియర్ల విభాగంలో, నియతి ప్రథమ బహుమతిని, యశస్విని ద్వితీయ బహుమతిని సాధించారు.పోటీల అనంతరం నిర్వహించిన బహుమతి పంపిణీ కార్యక్రమంలో, విజేతలకు శ్రీ రామకృష్ణ సేవా సమితి తరపున అధ్యక్షులు కటంగూరు సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి కె.వి.రావు, యోగా గురూజీ ఆంజనేయులు శాలువాలు కప్పి సన్మానించారు. ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు యువతలో యోగా పట్ల పెరుగుతున్న ఆసక్తిని కొనియాడుతూ, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. కార్యక్రమం యోగా పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిన దానికి నిదర్శనంగా నిలిచింది.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక అందించాలి

## -కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్దిదారులకు ఇసుక అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ కూడా ఇసుక కొరత కారణంగా ఇళ్ల నిర్మాణాలలో జాప్యం జరుగుతోందనే ఫిర్యాదులు రాకూడదని అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని కలెక్టర్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బాల్కొండ మండల కేంద్రంలో 41 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, లబ్ధిదారులు అందరు ఇళ్లను నిర్మించుకునేలా తోడ్పాటును అందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో, లబ్దిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చే వారికి ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆర్డీఓ దృష్టికి తేవాలని సూచించారు. ఏకధాటి వర్షాలు కురిస్తే వాగులు, నదులలో వరద జలాలు చేరుకొని ఇసుక లభించే పరిస్థితి ఉండదని, దీనిని దృష్టిలో పెట్టుకుని సరిపడా ఇసుక నిల్వలను ఇందిరమ్మ లబ్ధిదారులు సమకూర్చుకునేలా చూడాలన్నారు. లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, ఎంపీడీఓ విజయ్ భాస్కర్ తదితరులు ఉన్నారు.



# నేడు ఆత్మకూరు కు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి రాక

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.**

ఆత్మకూరు మండల కేంద్రానికి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడల యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి విచ్చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఎం.డి.రహీమతుల్లా తెలిపారు. గాంధీ చౌక్ నుండి మంత్రికి తిరుమల సాయి ఫంక్షన్ హల్ వరకు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలకాలని కోరారు. అనంతరం మంత్రి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు,కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు,శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



# భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు

## - కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి- మెండోరా తహసీల్ కార్యాలయం సందర్శన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి**

**నిజామాబాద్ బ్యూరో**

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కలెక్టర్ టి . వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. జక్రాన్పల్లి మండలం కేష్పల్లి లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ సందర్శించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా? అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో వివరాలు రాయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సాంకేతిక అంశాలను జాగ్రత్తగా గమనించాలని, సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులలో పొందుపర్చాలని అన్నారు. ఎలాంటి వివాదాలు లేని తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్ధమయ్యే రీతిలో తెలియజేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులను పదేపదే తిప్పుకోకూడదని, సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యవహరించాలని రెవెన్యూ బృందాలకు హితవు పలికారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ రెవెన్యూ సదస్సులు ముగిసిన మీదట క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని, అప్పుడే భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు.

### మెండోరా తహసీల్ కార్యాలయం సందర్శన

అనంతరం కలెక్టర్ మెండోరా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద మెండోరా మండలంలోని ఎనిమిది గ్రామాలలో రెవెన్యూ సదస్సుల ద్వారా సేకరించిన దరఖాస్తులను పరిష్కరిస్తున్న తీరును కలెక్టర్ అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు అందించే అవకాశం లభించని వారి నుంచి కూడా భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకోవాలని, అన్ని అర్జీలు పరిష్కరించిన మీదట భూ సంబంధిత సమస్యలు మళ్లీ తెర పైకి రాకూడదని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, తహసీల్దార్లు కిరణ్మయి, సంతోష్ రెడ్డి, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ గుడిహత్నూర్**

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్యాల కరుణాకర్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కేక్ కట్ చేసి జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఆరిఫ్ ఖాన్ మండల ప్రధాన కార్యదర్శి పవార్ రాజు మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఏకానాథ్ పటేల్ మండల కోశాధికారి చత్రుఘాన్ ఉపాధ్యక్షులు కుమ్ర శంభు మండల ఎస్ సీ సెల్ అధ్యక్షుడు దుబ్బాక నరేష్ నాయకులు ఏశ్వంత్ ,జాకు షేకు ,విష్ణు, సాయబ్రావు తదితరులు పాల్గొన్నారు



# సిరిసిల్లలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా నాయకులు సంగీతం శ్రీనివాస్, పిసిసి మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# రాజకీయ చిచ్చు !

బనకచర్ల ప్రాజెక్టుపై రాజకీయ నాయకులు మళ్లీ వివాదం రేపి పబ్బం గడుపుకునే ప్రయత్నంలో ఉన్నారు. గతంలో ఉమ్మడి ఎపిలో బాబ్లీ గొడవ చేశారు. అది సమిసిపోయింది. తాజాగా బనకచర్ల దొరికింది. ఇప్పుడు దీనిని సాగదీస్తూ, సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసే యత్నాలు మొదలయ్యాయి. రాయల సీమకు నీరందిస్తామని జగన్‌తో లంచ్ మీటింగ్‌లో ప్రకటించిన కెసిఆర్ పార్టీ బిఆర్ఎస్ ఇప్పుడు బనకచర్లపై విమర్శలు అందుకుంది. బనకచర్ల అనేది వృధాగా పోతున్న గోదావరి నీళ్లను మాత్రమే నిల్వచేసే ప్రాజెక్ట్. దీని నిర్మాణంతో ఎగువన ఉన్న తెలంగాణలో నీటిని తరలించుకునే అవకాశం లేదు. పైన నీళ్లు లేకుంటే గోదావరి ఎండిపోతుంది. అప్పుడు బనకచర్లకు నీరు వెళ్లడం అసాధ్యం కూడా. మొన్నటి వరకు తెలుగు రాష్ట్రాలు ఒక్కటే. ఉమ్మడి ఎపి అయినా, విడిపోయి రెండు రాష్ట్రాలుగా వేరయినా రైతులు, ప్రజలు ప్రయోజనాలు పొందాల్సిందే. నిజానికి గోదావరిలో ఏటా వందల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయి. ఇలా మనం ఏటా వర్షాకాలంలో వృధాగా పోతున్న నీటిని చూసి చింతిస్తున్నాం తప్ప అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నించడం లేదు. కాళేశ్వరం పేరుతో కట్టిన ఆనకట్ట వృధాగా పోయింది. కేవలం కమీషన్ల కోసం కట్టి ఇంజనీరింగ్ ప్రతిభ అని చెప్పుకున్న కెసిఆర్, ఇప్పుడేమో, దానిపై విచారణ సాగగానే మాటమారుస్తున్నారు. కాళేశ్వరం సరిగా కట్టివుంటే, సరైన ప్రాంతంలో డిజైన్ చేసివుంటే గోదావరి నీళ్లను మనం ఉపయోగించుకునే వీలుండేది. కానీ ఇప్పుడది తెల్ల ఏనుగులా మారింది. రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడానికి ఎలా వ్యవహరిస్తారన్న దానికి కాళేశ్వరం ప్రత్యేక ఉదాహరణ. బిబిసి సహా అనేక చోట్ల దీనిని మానవనిర్మిత అద్భుతంగా ప్రచారం చేసుకున్న కెసిఆర్, ఆయన బృందం ఇప్పుడు కేబినేట్ అనుమతితోనే నిర్మించామని మాటమార్చారు. నిజానికి గోదావరి జలాలను ఎంతగా వినియోగించుకుంటే అంతమంచిది. చుక్కనీరు కూడా సముద్రంలో కలిసి పోకుండా తెలంగాణ, ఎపిలు ఉమ్మడిగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. అంతేగాని వివాదాలు కాదు. దీనికోసం కేంద్రాన్ని కలవడం, సుప్రీం కోర్టుకు వెళ్లడం సరికాదు. ఈ వ్యవహారంలో చిచ్చురాజేసి చలి కాచుకోవాలన్న బిఆర్ఎస్ ప్రయత్నాలు కూడా ఆమోద యోగ్యం కాదు. నిజానికి బనకచర్ల అనుసంధానంపై రగడను బీఆర్ఎస్ పార్టీ ప్రముఖంగా లేవదీసింది. ఆ పార్టీ అధికార మీడియాలో ప్రతిరోజూ వరసబెట్టి ఈ అనుసంధానానికి, ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేక కథనాలు వస్తున్నాయి. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ ఉపయోగించుకోగా మిగిలిన నీరే కిందకు పోతుందనే స్పృహ లేకుండా బీఆర్ఎస్ తీరు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంభకోణం బీఆర్ఎస్ పార్టీ మెడకు చుట్టుకోవడంతో దాన్ని పక్కదారి పట్టించేందుకు బనకచర్ల వ్యవహారాన్ని బిఆర్ఎస్ ప్రచారం చేసుకుంటోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు దెబ్బ తిని నీటిని నిల్వ చేయక పోవడానికి, అవినీతిపై కమిషన్ విచారణ చేయడంతో వ్యూహాత్మకంగా బిఆర్ఎస్ బరితెగింపు రాజకీయం చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై న్యాయ విచారణ జరుపుతున్న ఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ విచారణకు హాజరై ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అయితే కాళేశ్వరం ఎపిసోడ్ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీఆర్ఎస్ పార్టీ బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై దుమ్మెత్తి పోస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి వాదనలు తీసుకుని వచ్చే వారి రాజకీయ దురుద్దేశ్యాలను ఎండగట్టాల్సిందే. ఈ నీటిని పూర్తిగా ఎలా నిలువరించాలో ఆలోచన చేయాలి. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లు కిందకు వస్తేనే ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకొనే వీలుంటుంది. అప్పుడే బనకచర్లకు నీరు వెళుతుంది. అంతే తప్ప సముద్రంలోకి వెళ్లదు. ఈ ఆలోచన మంచిదే. మహారాష్ట్ర కట్టిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తితేనే శ్రీరామ్‌సాగర్‌కు నీళ్లు వస్తున్నాయి. గోదావరి నదిలో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తన వాటాకు మించి ప్రాజెక్టులు కట్టుకొంటే పై నుంచి అవసరమైన మేరకు నీళ్లు రాకుంటే అవి వృధాగా ఉండాల్సిందే. బనకచర్ల ద్వారా వృధానీటి తరలింపు సఫలమైతే నదుల అనుసంధానానికి అడుగు వేసిన వారం అవుతాం. కేంద్రం కూడా ఇలాంటి సమస్యలపై సత్వరంగా స్పందించి, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చించాలి. అంతేతప్ప తాత్సారం చేయరాదు. చోద్యం చూడరాదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటివాటాల వివాదం అపరిష్కృతంగా ఉంది. కృష్ణా విషయంలో తరచూ కీచులాటలు తప్పడం లేదు. ఒకవేళ బనకచర్ల సాకారం అయితే కృష్ణాపై ఒత్తిడి తగ్గుతుంది. గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన 1486.85 టీఎంసీల్లో 957.85 టీఎంసీల నీళ్లు తమవని తెలంగాణ చెబుతున్నది. ఇదే నిజమైతే...ఈ నీటిని నిలవచేయడానికి అవసరమైన ప్రాజెక్టులు నిర్మించాలి. ట్రిబ్యునల్ నియామకమైతే దాని ముందు తన వాటాను గురించి వాదించవచ్చు. ప్రస్తుతం తను చెబుతున్న వాటా మేరకు కొన్ని ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఆమోదం కోసం కృషి చేస్తున్నది. తెలంగాణ కూడా గోదావరి జలాలను ఒడిసిపట్టే ప్రయత్నం చేయడంలో తప్పు లేదు. అయితే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా, ఇక్కడి నుంచి నీరు కిందికి పోతేనే వారి ప్రయత్నం ఫలిస్తుంది. ఎగువ రాష్ట్రాలు నిర్మించే ప్రాజెక్టులపై సాధారణంగా దిగువ రాష్ట్రాలు అభ్యంతరాలు చెబుతాయి. ఎందుకంటే దిగువన ఉన్న తమకు నీరు వస్తుందో రాదో అన్న భయం ఉంటుంది. ఆల్మట్టి, నారాయణపూర్ , బాబ్లీ ప్రాజెక్టులు ఇలా కట్టినవే. దీంతో కృష్ణా గోదవరుల్లో సకాలంలో నీరు రావడం లేదు. ఎగువన భారీ వర్షాలు పడి, ప్రాజెక్టుల్లోకి నీరు వస్తేనే కృష్ణమ్మ గలగలలు వినిపిస్తాయి. ఇదే క్రమంలో తెలంగాణ ప్రాజెక్టులు కడితే ఎపికి నష్టం తప్ప, ఎపి ప్రాజెక్టులు కడితే తెలంగాణకు నష్టం ఉండబోదు. పోలవరం వల్ల వరద ముంపు ఉందంటున్న తెలంగాణ నేతలు, దానినీరు మరింతగా రాకుండా కిందకు వెళితే మంచిదే అన్న విషయం ఆలోచించడం లేదు. దిగువన ఉండే ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు కట్టుకొంటే ఎగువన వుండే తెలంగాణకు ఏ విధంగా నష్టం కలుగుతుందో బిఆర్ఎస్ నేత హరీష్ రావు చెప్పాలి. రాయలసీమకు నీళ్లు పారిద్దామన్న కెసిఆర్ ఈ పంచాయితీపై ఎందుకు నోరు మెదపడం లేదో చెప్పాలి. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టులకు వాడుకోగా ఏటా అపారమైన వరదనీరు వెల్లువెత్తుతుంది. ఈ వరదనీటిని వాడుకొనేందుకే గోదావరిపై బనకచర్ల అనుసంధానం రూపకల్పన చేస్తున్నారు. ఈ వివాదం జటిలం కావడానికి బిఆర్ఎస్ కారణం తప్ప మరొకరు కాదు. దీంతో పాటు జగన్మోహన్‌రెడ్డి కూడా బాధ్యులే. 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కృష్ణ జలాలు పంపకానికి తోడు, గోదావరి జలాల వాటాలు తేల్చేందుకు ట్రిబ్యునల్ వేయాలని తీర్మానం చేశారు. అయితే కృష్ణ జలాల ట్రిబ్యునల్ కోసమే కేసీఆర్ పట్టుబట్టారు.

# చేయూత పథకం పై అధికారులకు దిశా నిర్దేశం చేసిన - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ఫ్ ఆధ్వర్యంలో చేయూత పథకం (సామాజిక భద్రత పింఛన్లు) కార్యక్రమం పై గురువారం జిల్లా కేంద్రం లోని ఎస్టియు భవన్ లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు.వర్క్ షాప్ ఆన్ చేయూత పెన్షన్ పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ స్వచ్ఛ సర్వేక్షన్ 2025.ఎస్టీయూ భవన్ నందు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చేయూత పెన్షన్లు పంచాయతీ అడ్వాన్స్ మెంట్ ఇండెక్స్(పిఏఐ) స్వచ్ఛ సర్వేక్షణ 2025 కార్యక్రమాలపై వర్క్ షాప్ నిర్వహించారు.వర్క్ షాప్ కు డైరెక్టర్ గోపాల్ రావు హాజరై చేయూత పెన్షన్ల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవోలకు మున్సిపల్ సిబ్బందికి రించారు.మరణించిన వారి పేర్ల తొలగింపు,అనర్హుల ఏరివేత,కొత్త పెన్షన్ దరఖాస్తులు మొదలగు వాటి గూర్చి డైరెక్టర్ వివరించారు.అనంతరం పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ గూర్చి డి ఎల్ పి ఓ.పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు.ఏపిడి ఎస్ బీఎం కోఆర్డినేటర్




స్వచ్ఛ సర్వేక్షన్ గూర్చి వరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి మాట్లాడుతూ శిక్షణలో ఇచ్చిన వివరాలు ఆధారంగా ఆయా పథకాల నిర్వహణను చేపట్టాలని చేయుత పెన్షన్ల ను సకాలంలో అందించేటట్లు చూడాలని అనర్హులను,మరణించిన వారి పేర్లను తొలగించాలని సూచించారు.వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అర్హులై ఉండి సదరం సర్టిఫికెట్ లేనివారు యుడిఐడి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ సమాచారం సరిగ్గా పూరించాలని సత్య సర్వేక్షన్ లో అవార్డులు పొందే దిశగా కార్యదర్శులు ఎంపీడీవోలు కృషి చేయాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి,డిపిఓ రమేష్,ఏపీ డి డి ఆర్ డి ఎల్ పి ఓ లు,ఎంపీడీవోలు,ఏపీవోలు,పంచాయతీ కార్యదర్శులు,మున్సిపల్ కమిషనర్,మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలగా బొల్లారం ఉన్నత పాఠశాల -ఎమ్మెల్యే జీ ఎం ఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం మున్సిపల్ పరిధిలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లా పరిషత్ మండల పరిషత్ పాఠశాలలలో అదనపు తరగతులు నిర్మించడంతోపాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు గురువారం బొల్లారం మున్సిపాలిటీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 37 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన అదనపు తరగతులను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొల్లారం మున్సిపాలిటీలో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు స్థానిక పరిశ్రమలలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని వీరి పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో బొల్లారం జిల్లా పరిషత్ మరియు మండల పరిషత్ పాఠశాలలను ఆధునీకరించామని తెలిపారు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు నిర్మించడంతోపాటు మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు 25 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో ప్రతి తరగతికి పెయింటింగ్ ఫ్లోరింగ్ తో పాటు రంగురంగుల బొమ్మలు వివిధ శాస్త్రవేత్తల చిత్రాలు వేయించానని తెలిపారు విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ఆవరణలో గల క్రీడా ప్రాంగణాన్ని సైతం ఆధునికరిస్తున్నామని



వాలీబాల్ బ్యాడ్మింటన్ కోకో కబడ్డీ కోర్టులను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు ప్రస్తుతం ఉన్నత పాఠశాలలో 975 మంది ప్రాథమిక పాఠశాలలో 250 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారనిరాబోయే రోజుల్లో పాఠశాలను మరింత అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఎంపీడీవో అరుణ మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి సీనియర్ నాయకులు చంద్రారెడ్డి హనుమంత్ రెడ్డి అనిల్ రెడ్డి మాజీ ప్రజా ప్రతినిధులు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# కృష్ణ, మాగనూర్ మండలాల బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతంచేయండి

## జిల్లా నాయకులు మజ్జిగ సురేష్, ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ...**

**నారాయణపేట జిల్లా**

భారతీయ జనతా పార్టీ కృష్ణ, మాగనూర్ ఉమ్మడి మండల కార్యశాల (సమావేశం ) నేడు శుక్రవారం ఉదయం 10 గంటలకు కృష్ణ మండల కేంద్రంలోని స్వామి వివేకానంద సేవా ఆశ్రమంలో నిర్వహించడం జరుగుతుందని బిజెపి జిల్లా నాయకుడు మజ్జిగ సురేష్ అధ్యక్షుడు నల్లే నరసప్ప విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య,జిల్లా అధ్యక్షులు కొండా సత్యయాదవ్ మరియు రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి శంకరొళ్ల రవికుమార్ పాల్గొంటున్నారని తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ సమావేశం ఉద్దేశం ఉమ్మడి మండల నూతన కార్యవర్గం ప్రకటన, మరియు బూత్ అధ్యక్షుల



సన్మానం నిర్వహించచి పలు రాజకీయ తీర్మాణలు ప్రవేశ పెట్టడం జరుతుందని అన్నారు.ఈ కార్యక్రమనికి ఉమ్మడి మండలంలోని రాష్ట్ర, జిల్లా, మండల పదధికారులు సీనియర్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు బూత్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విధిగా పాల్గొని కార్యక్రమన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాగనూరు మండల మాజీ అధ్యక్షుడు జయనందరెడ్డి, కృష్ణా మండలం మాజీ అధ్యక్షుడు జగ్గిలి హుస్సేనప్ప,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కనకరాజు, సీనియర్ నాయకులు కృష్ణయ్య,నారాయణ భట్, డీకే కిష్టప్ప,శంకరప్ప, అజిత్ దీక్షిత్,శక్తి సింగ్ పాల్గొన్నారు.

# కండ్లీ లో భూ భారతి అవగాహణ సదస్సు

**సమయజ్యోతి న్యూస్ జూన్ 19 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలం లోని కండ్లీ గ్రామంలో భూ భారతి అవగాహణ సదస్సు లో ఉప తహశీల్దార్ హీరా లాల్ పాల్గొని అనంతరం ఆయన మాట్లాడుతూ భూ తగాదాలు పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి తీసుకు వచ్చింది అని పేర్కొన్నారు ప్రజలు ఆ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలి అని పేర్కొన్నారు భూ సమస్య లకు 13 అప్లికేషన్ వచ్చినవి ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కిషన్ గుప్తా ఉప తహశీల్దార్ హీరా లాల్ ఆర్ ఐ నూర్ సింగ్ సంజీవ్ జూనియర్ అసిస్టెంట్లు స్రవంతి రమేష్ రికార్డు అసిస్టెంట్లు ఆశతాయి గౌతం ఎ ఈ ఓ చౌహాన్ కృష్ణా పాల్ సింగర్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు




# కోడెలను నిత్యం పర్యవేక్షిస్తూ.. సంరక్షించాలి

## - జిల్లా పశువైద్యాధికారి రవీందర్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాలల కోడెలను నూతన సిబ్బంది వాటిని నిత్యం పర్యవేక్షిస్తూ సంరక్షించాలని జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి సూచించారు. వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాల, ఆలయానికి సమీపంలోని కట్టకింద గోశాలలో పనిచేసేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారిలో నుంచి పలువురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో జిల్లా పశువైద్యాధికారి రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ గురువారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గోశాలలో నియామకమైన సిబ్బంది వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కోడెలు, ఆవుల సంరక్షణపై వివరించారు. ప్రతి రోజు జీవాలకు పచ్చి గడ్డి, ఎండు గడ్డి, దాణా మూడు సార్లు ఇవ్వాల్సి ఉంటుందని, వాటికి నిత్యం పరిశుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. జీవాలు ఉండే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వాటి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గోశాలలోని పశు వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. గోశాలలో పశువైద్యాధికారి, సహాయకులు, అటెండర్ అందుబాటులో ఉంటారని వెల్లడించారు. గోశాలలోని జీవాలకు సీజనల్ గా అన్ని టీకాలు వేసేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతగా తమ విధులు నిర్వర్తించి జీవాలను సంరక్షించాలని స్పష్టం చేశారు.



# మోడీ 11 సంవత్సరాల పరిపాలన స్వర్ణ యుగం

## మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్

## బజార్ హత్నూర్ లో బిజెపి విస్తృతస్థాయి సమావేశం

**సమయజ్యోతి న్యూస్ జూన్ 19**

**బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన బజార్ హత్నూర్ మండల బిజెపి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బోథ్ నియోజకవర్గ కన్వీనర్ బాబారావు పటేల్ మరియు బిజెపి సీనియర్ నాయకులు మాధవ్ రావు అమ్టెహాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ.11 ఏళ్ల మోదీ పాలన సూపరిపాలనకు కేర్ ఆఫ్ అడ్రస్2014 నుంచి ఇప్పటి వరకు దేశ అభివృద్ధిలో మోదీ తనదైన ముద్ర వేసారు.2047 నాటికి భారత్ దేశం అభివృద్ధి చెందిన దేశంగా మొదటి స్థానంలో ఉండాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యం ఈ 11 ఏళ్లలో భారత్ అన్ని రంగాల్లో ఊహించని పురోగతి సాధించింది దేశ అభివృద్ధి, రక్షణ రంగం బలోపేతం విషయంలో ప్రపంచంలోనే నెంబర్ వన్ గా నిలిచాం.వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రధాని మోదీ పనిచేస్తున్న తీరు ప్రపంచానికే ఆదర్శనీయం.గత 60 ఏళ్లలో చేయలేని ఎన్నో అభివృద్ధి పనులు ఈ 11 ఏళ్లలో చేసి చూపాము.తెలంగాణాలో ఈ 11 ఏళ్లలో తెలంగాణలో 2 లక్షలు కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి చేసాం. మరో 2 లక్షలు కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చాము. తెలంగాణలో 5వేల కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది. - 33 జిల్లాల్లో 32 జిల్లాలకు జాతీయ రహదారితో అనుసంధానం జరిగింది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి 335 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్లు వేసాం 10వేల కిలోమీటర్లు డబ్లింగ్, ట్రిప్లింగ్ చేసాం. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న కరీంనగర్ - నిజామాబాదు లైన్ పనులు మొదలయ్యాయి. తెలంగాణలో అతిపెద్ద రైల్వే టెర్మినెల్ చర్లపల్లి ఆధునికరణ జరిగింది. 580 కోట్లతో కాజీపేటలో రైల్వే మన్యుఫాక్చరింగ్ యూనిట్ ఇటీవల రైల్వే బడ్జెట్లో తెలంగాణకు 5337 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అంతర్జాతీయ విమానాశ్రయాలకు ధీటుగా రైల్వే స్టేషన్ ల అభివృద్ధి జరుగుతుంది. ఇటీవలే అమృత్ రైల్వేస్టేషన్ లలో భాగంగా వరంగల్, బేగంపేట్, కరీంనగర్ రైల్వేస్టేషన్ ల అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఉడాన్ స్కీం కింద వరంగల్ మామునుర్ కు విమానాశ్రాయం మంజూరయ్యింది. రామప్ప దేవాలయనికి యునేస్కో గుర్తింపు వచ్చింది.రామగుండం లో ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్దరణ, అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభించాము. మోదీ దూరదృష్టితో ఆర్థిక రంగంలో భారతదేశం సరికొత్త రికార్డు నమూదు చేసింది కిసాన్ సమ్మాన్ నిధి కింద 11 కోట్ల మంది రైతులకు రుణాలు - గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (వన్ నేషన్ వన్ రేషన్ కింద) ద్వారా ఇప్పటి వరకు 81 కోట్ల మందికి 5 కిలోల ఉచిత బియ్యంముద్ర లోన్స్ కింద 20 లక్షల వరకు రుణాలు 3 కోట్ల మంది మహిళలను లక్షధికారులను చేయాలన్న లక్ష్యంతో మహిళా సంఘాలకు 0 వడ్డీ రుణాలు ఇస్తున్నాం.ఇలా చెప్పుకుంటూ పోతే 11 ఏళ్ల కాలంలో మాటల్లో చెప్పలేనంత అభివృద్ధిని చేసి చూపించారు మన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, మరియు మండల పదాధికారులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, (చైర్మన్లు,జడ్పీటీసీ లు ఎంపీటీసీ లు సర్పంచ్ లు) కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రజలకు భరోసా కలిగిస్తున్నాయి

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో,**

**జూన్ 19.**

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు గ్రామస్తులకు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.గురువారం సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా పరిష్కారాన్ని ఆశిస్తూ ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. ప్రజలంతా గ్రామ రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని తమ సమస్యలు తెలియజేయాలని సూచించారు.కర్షల గుట్ట సర్వే నం.582లో ఉన్న భూ సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ సదస్సులో రైతులు సమర్పించిన ప్రతి దరఖాస్తుపై రసీదు ఇవ్వాలని, పూర్తి వివరాలు రిజిస్టర్లో నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే సర్వేయర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, శుభ్రత పట్ల నిరంతర శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వంటగది పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరీక్షించారు. పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్, ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకుని బోర్డు పరీక్షలకు సిద్ధం కావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నట్టుగా ప్రజల్లో విశ్వాసం పెరిగేలా బోధన చేయాలనీ, వందశాతం హాజరు నమోదు కావాలన్నారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, యూనిఫాంలు, సైన్సు పరిజ్ఞానాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.పదవ తరగతి విద్యార్థులు అభిలాష్ (నెట్ బాల్), రమ్య (బేస్ బాల్) జాతీయ స్థాయిలో విశిష్ట ప్రదర్శన కనబరిచినందుకు వారిని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఈఓ రామారావు, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి రోజు యోగా సాధనతో ఆరోగ్యం ఐడీఓసీలో దశాబ్ది ఉత్సవాలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

నిత్యం యోగా సాధనతో ఆరోగ్యంగా ఉంటారని ఆయుష్ యునాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు బీ శ్రీనివాస్, టీ స్వప్న పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో గురువారం ఉదయం కామన్ యోగా ప్రోటోకాల్ పై జిల్లా అధికారులు, సిబ్బందికి ఆయుష్ యునాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు యోగా ఆసనాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగా ఆసనాలు, ప్రాణాయామం ముద్రలు ధ్యానము అంశాలపై వివరిస్తూ..చేయించారు. ప్రతి రోజు యోగా చేయడం వలన కలిగే లాభాలు, ఆరోగ్యం ఆనందం ఎలా పొందవచ్చు వంటి వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది, కలెక్టరేట్ కార్యాలయ ఏవో రామ్ రెడ్డి, ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డా.శశి ప్రభ, వైద్యులు సౌమిని, శ్వేత, స్వరూప, కళ్యాణి, డీపీఎం తిరుపతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# హత్తిగుట్ట లో వైద్య శిభిరం డా. సర్ఫరాజ్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్**

ఆదిలాబాద్ రూరల్ మండలములోని అ%శీ%కోలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో గల హత్తిగుట్ట, బోరింగ్ గూడ, రాజుగూడ గ్రామప్రజకు వైద్య చికిత్స లు జరిపినట్టు డా. సర్ఫరాజ్ గారు తెలియజేసినారు, కార్యక్రమం లో ఈరోజు అక్కడి పాఠశాలలో 21, మంది పిల్లలకు ఐరన్ మాత్రాలు మింగించడమైంది,గ్రామములో 35,మందికి సికిల్ సెల్ పరీక్షలు జరిపినాము,జిల్లా టీబి సిబ్బంది దయానందం, అరుణ్ 53 ఎక్స్ రే లు తీయడమైంది, ఏరియా హెల్త్ సూపర్ వైజార్ బొమ్మెత సుభాష్, శకుంతల,జన్ మన్ డా అర్జున్ గారు, సుష్మ, వీణా, ఎం ఎల్ హెచ్ పి ఆకాంక్ష,ఆరోగ్య కార్యకర్తలు సత్యవతి, శైలజ, నారాయణ, నల్ల ఈశ్వర్ రెడ్డి, పవర్ ప్రేమసింగ్, ఆశా లక్ష్మి, అర్కు బాయి, పాల్గొన్నారు



# కాంగ్రెస్ భవన్ లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయ భవనంలో గురువారము రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. కేక్ కత్తిరించి కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీకి 55వ జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ నిరంతరం దేశ అభివృద్ధి వైపు చూసే వ్యక్తి అని, కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్న నాయకుడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాహుల్ గాంధీ ఆశయం మేరకు ఎన్నకల హామీలను నెరవేరుస్తున్నామని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకు వెళుతుందని, రాహుల్ గాంధీ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నామని,



ఆయనను ప్రధానిగా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోపి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ధర్మ గౌడ్, డిసిసి డెలిగేట్ ప్రమోద్, మహిళా అధ్యక్షురాలు రేవతి, ఎస్సీ సెల్ అధ్యక్షులు వినయ్, సంగెం సాయిలు, నరేంద్ర సింగ్, ప్రవీణ్, సాయి కుమార్, మలైకా బేగం, పుప్పాల విజయ, ముష్క పటేల్ పాల్గొన్నారు.

# 1,10,322 మంది రైతుల ఖాతాల్లో రూ. 99.5 కోట్ల రైతు భరోసా నిధులు జమ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్నదాతలకు రైతు భరోసా కింద మూడు రోజుల్లో రూ. 99.5 కోట్లకు పైగా డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఖరీఫ్ వానాకాలం సీజన్ సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ రోజు వరకు జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 1,10,322 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.99,52,19,906= 00 డబ్బులు జమ అయ్యాయని పేర్కొన్నారు.



# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు గున్నాల వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కత్తిరించి కార్యకర్తలకు అందజేశారు. మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తౌట్ అరవిందు, ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ చిట్యాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు విక్కీ, జనరల్ సెక్రెటరీ తేజ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషన్ గౌడ్, యూనిస్, కుందారం శ్రీనివాస్, మజార్ వహాబ్ రియాజ్ షేరు, గడ్డం రవి, రాజ్ కుమార్, గంగమల్లు, అన్వర్, చాట్ల నరేష్, పురుషోత్తం, డి సాయన్న, పుల్లయ్య నవీన్ పిట్ల, దయాకర్, విద్యాసాగర్, చిట్టి, సన్నిత్, యాదవ్, నాగేష్, నిజ్జు, తమ్మి కపిల్, ముజీబ్ పాల్గొన్నారు



# కాకతీయ నగర్ లో బస్తీ దర్శన్ కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

రామచంద్రాపురం డివిజన్ కాకతీయ నగర్ లో కాకతీయనగర్ అసోసియేషన్ కోరిక మేరకు జలమండలి మేనేజర్ లోకేష్ మరియు సిబ్బంది తో కలిసి గురువారం బస్తీ దర్శన్ నిర్వహించినట్లు కార్పొరేటర్ పుష్పానగేష్ తెలియచేశారు గత బస్తీ దర్శన్ లో గుర్తించి ప్రతిపాదనలు పంపిన భూగర్భ మురుగునీటి పైప్ లైన్ లను త్వరలో వేయిస్తానని కార్పొరేటర్ దంపతులు తెలిపారు కాలనీ లో స్ట్రీట్ పోల్స్ స్ట్రీట్ లైట్స్ కూడా వేయిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు కాలనీ అధ్యక్షులు సాగర్ ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు ప్రతాప్ రెడ్డి మునిదర్ జిలాని వెంకట్రావు కృష్ణరెడ్డి ఎస్ఎంరవి రావిరమేష్ ఉమాశంకర్ పాండురంగం మానయ్య ప్రవీణ్ సలాం రమేష్ సత్యం తదితరులు పాల్గొన్నారు



# నూతన కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన.. మొహమ్మద్ యునుస్ సన్మానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ ప్రతినిధి**


బాల్కొండ మండల కేంద్రంలో గురువారము నిజామాబాద్ జిల్లా నూతన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మైనారిటీ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ యునుస్ కలెక్టర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు.



# ఇరాన్ అధినేత ఖొమేనీ హత్య సాధ్యమేనా?

## -ఇజ్రాయిల్ దూకుడను ట్రంప్ అడ్డుకున్నాడా-ఖొమేనీ తరవాత ఇరాన్ భవిత్యవం ఏమిటి?

**టెహ్రాన్,జూన్19సమయజ్యోతి:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హత్య చేయాలన్న ఇజ్రాయెల్ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్డుకున్నట్లుగా ఇటీవల పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ చనిపోయిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ సైతం ఈ వార్తలను తోసిపుచ్చలేదు. సుప్రీం కమాండర్‌కు అనుకోని విధంగా ఏదైనా జరిగితే కొత్తగా బాధ్యతలు ఎవరు స్వీకరిస్తారనే చర్చ జరుగుతున్నది. ఇరాన్ రాజకీయాలు సంక్లిష్టంగా ఉన్నప్పటికీ నిపుణులు మాత్రం ఖమేనీ కుమారుడు అతని తర్వాత సుప్రీం లీడర్‌గా వచ్చేందుకు అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల 30 మంది ఇరానియన్ నిపుణులతో నిర్వహించిన బీబీసీ పర్షియన్ పోల్‌లో.. అయతుల్లా అలీ ఖమేనీ రెండో తనయుడు మోజ్‌తబా తన తండ్రి బాధ్యతలను చేపడుతాడని విశ్వసిస్తున్నట్లుగా తేలింది. కానీ, ఇరాన్ సొంత వ్యవస్థ అడ్డంకిగా మారే అవకాశం ఉంది. వంశపారంపర్య వారసత్వం ద్వారా అధికారాన్ని బదిలీ చేయాలన్న ఆలోచన 'ఇస్లాం వ్యతిరేకంగా' పేర్కొన్నారు. షాను తొలగించిన అయతుల్లా రుహోల్లా ఖమేనీ.. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది రాచరికం కంటే మెరుగైంది ఏమీ కాదన్నారు. ఈ విషయంలో ఆయన ఆలోచనలు ప్రసంగాలు, ఇతర రచనలను సేకరించిన 21-సంపుటాల సముదాయం సహిఫెయే ఇమామ్ ఖమేనీలో నమోదయ్యాయి. 1989లో ఖమేనీ తర్వాత సుప్రీం నాయకుడిగా మారిన ఖమేనీ.. వంశపారంపర్య పాలన ఇస్లామిక్ వ్యవస్థకు తగదని అన్నారు. ఇరాన్‌లో అయతుల్లా రుహోల్లా ఖమేని చిత్రం ప్రతిచోటా కనిపిస్తుంది. ఇరాన్ కరెన్సీ నోట్లు.. తరగతి గదులు.. ప్రభుత్వ భవనాల్లో ఆయన చిత్రం కనిపిస్తుంది. ఆయన 1979 ఇస్లామిక్ విప్లవానికి నాయకత్వం వహించారు. పాశ్చాత్య దేశాల మద్దతు ఉన్న షాను పదవి నుంచి తొలగించారు. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 1983 నివేదికలో.. ఖమేనీ ప్రభావం లేకుండా ఈ విప్లవం సాధ్యమయ్యేది కాదని పేర్కొంది. మతం-రాజకీయాలు విడదీయరానివని ఆయన భావించేవారు. ఇస్లాం అంటే రాజకీయాలని ఆయన ఓ సారి వ్యాఖ్యానించారు. ఆయనపై షియా విశ్వాసాల లోతైన ప్రభావం కనిపిస్తుంది. ఆయన తాత సయ్యద్ అహ్మద్ ముసావికి భారత్‌తో సంబంధాలున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ పట్టణం ఆయన స్వస్థలం. 1979 ఇస్లామిక్ విప్లవానికి నాయకత్వం వహించిన ఖమేనీ తన తాత అహ్మద్ ఆధ్యాత్మిక మార్గం నుంచే ప్రేరణ పొందారు. అహ్మద్ భారతదేశం నుంచి ఇరాన్‌కు వెళ్లారు. ఖమేనీ ఆ తర్వాత ఇరాన్ దేశ మొదటి సుప్రీం నాయకుడు అయ్యాడు. ఇరాన్‌ను దైవపరిపాలనా రాజ్యంగా మార్చాడు. అహ్మద్ తన భారతీయ మూలాలను ప్రతిబింబించడానికి 'హిందీ' అనే పేరును తన పేరులో కలిపి పెట్టుకున్నాడు. అహ్మద్ 1830లో బారాబంకీని వదిలి వెళ్లాడు. ఆయన తండ్రి దిన్ అలీ షా 1700లో మధ్య ఇరాన్ నుంచి భారతదేశానికి ప్రయాణించాడు. 1800 ప్రాంతంలో జన్మించిన అహ్మద్.. మొఘల్ సామ్రాజ్యం పతనం తర్వాత భారతదేశంలో బ్రిటిష్ నియంత్రణ పెరుగుతున్న సమయంలో లక్నో నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బారాబంకి సమీపంలోని కింటూరు గ్రామంలో పెరిగాడు. ఇస్లాంకు పునరుజ్జీవనం అవసరమని.. ముస్లింలు సమాజంలో తమ స్థానాన్ని తిరిగి పొందాలని నమ్మిన ముస్లిం ప్రముఖుల్లో ఒకడు. ఆయన షియా మత గురువు. 1800 ప్రారంభంలో భారతదేశం నుంచి ఇరాక్‌కు బయలుదేరాడు. ఆ సమయంలో పర్షియా పేరుతో పిలువబడ్డాడు. 1830లో నజాఫ్‌లోని అలీ సమాధిని సందర్శించాడు. 1834 నాటికి ఇరానియన్ పట్టణమైన ఖోమిన్‌కు వెళ్లి ఒక ఇల్లు కొనుక్కున్నాడు. అక్కడే కుటుంబాన్ని ప్రారంభించాడు. ఆయన ప్రయాణం తన మతంపై నమ్మకంతో దాన్ని వ్యాప్తి చేయాలనే కోరిక ఉండేది. ఖోమిన్‌లో ఆయన మూడుసార్లు వివాహం చేసుకున్నాడు. ఆయనకు ఐదుగురు సంతానం. వారిలో ఒకరు రుహోల్లా ఖోమినీ తండ్రి మోస్తఫా. ఆయన 1902లో జన్మించాడు. అహ్మద్ హిందీ 1869లో తుదిశ్వాస విడిచారు. ఖమేనీ పుట్టడానికి చాలా కాలం ముందే అహ్మద్ హిందీ మరణించినప్పటికీ.. కుటుంబ విలువలు, విశ్వాసం సుప్రీం లీడర్ ఖమేనీ ద్వారా ఇరాన్ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాయి.



# ఇరాన్ అణు స్థావరాలు దెబ్బతిన్నాయా?

## ఇజ్రాయిల్ దాడులతో అణు ప్రమాదం ఉందా

**టెహ్రాన్,జూన్19సమయజ్యోతి:** ఇరాన్ అణ్వాయుధ ప్రణాళికలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగిస్తోంది. ఇప్పటికే దాడుల్లో ఇరాను ముఖ్యులు హతమయ్యారు. ఖొమేనిని కూడా అంతమొందిస్తామని అంటున్నారు. ఇకపోతే పలు యురేనియం శుద్ధి కేంద్రాలను ఐడీఎఫ్ ధ్వంసం చేసింది. అయితే.. అణు బాంబుల తయారీ కోసం టెహ్రాన్‌కు ఉన్న అన్ని వనరులను సమూలంగా నాశనం చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా అరాక్ హెవీ వాటర్ రియాక్టర్ ప్రాంతాన్ని ఖాళీ చేయాలంటూ ఐడీఎఫ్ పోస్ట్ పెట్టడం గమనార్హం. ఆ తర్వాత కాసేపటికే అక్కడ ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఈ ప్లాంట్ ఉపగ్రహ చిత్రాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ అక్కడి ప్రజలకు ఐడీఎఫ్ వార్నింగ్ ఇచ్చింది. ఆ రియాక్టర్ సమీపంలోని ప్రజలు తక్షణమే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించింది. ఈ పోస్ట్ చేసిన కొన్ని గంటలకే అరాక్ హెవీ వాటర్ రియాక్టర్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. అయితే, ప్రస్తుతానికి అక్కడ రేడియేషన్ ప్రమాదం ఏదీ లేదని తెలుస్తోంది. అరాక్ హెవీ వాటర్ రియాక్టర్.. టెహ్రాన్‌కు నైరుతి దిశగా 250 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ హెవీ వాటర్‌ను న్యూక్లియర్ రియాక్టర్లు చల్లబర్చేందుకు ఉపయోగిస్తారు. అయితే ఈ పక్రియలో ప్లూటోనియం ఉప ఉత్పత్తిగా లభిస్తుంది. దీన్ని అణ్వాయుధాల తయారీలోనూ వినియోగిస్తారు. అంటే.. శుద్ధి చేసిన యురేనియం లేకుండానే అణుబాంబును అభివృద్ధి చేసేందుకు ఇరాన్‌కు ఉన్న ప్రత్యామ్నాయ మార్గం ఇది. 2015లో ప్రపంచదేశాలతో కలిసి ఇరాన్ అణుఒప్పందంపై సంతకం చేసింది. ఆ ఒప్పందానికి అనుగుణం గానే 2019లో హెవీ వాటర్ రియాక్టర్ సెకండరీ సర్క్యూట్‌ను టెహ్రాన్ ప్రారంభించింది. అప్పట్లో ఈ అరాక్ రియాక్టర్‌ను రీడిజైన్ చేసేందుకు ఇరాన్‌కు బ్రిటన్ సాయం చేసింది. ప్లూటోనియం ఉత్పత్తిని పరిమితం చేసేలా దీన్ని పునర్‌నిర్మించేందుకు సన్నాహాలు జరిగాయి. అయితే, ఇరాన్ మాత్రం దీనికి విరుద్ధంగా ప్లూటోనియం ఉత్పత్తిని పెంచుతున్నట్లు తెలిసింది. సాధారణంగా ఈ కార్యక్రమాలపై ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఎంఇఎ) ఇన్‌స్పెక్టర్ల నిఘా ఉంటుంది. కానీ, ఇరాన్ వీరిపై ఆంక్షలు విధించడంతో.. హెవీ వాటర్ రియాక్టర్ కేంద్రం సామర్థ్యాలపై అంచనాల్లేకుండా పోయాయని ఐఏఈఏ వెల్లడించింది.

# అమెరికా వెళ్లే విద్యార్థులకు వీసోదయం

## వీసా ఇంటర్వ్యూలను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటన

## సోషల్ మీడియా ఖాతాలను పరిశీలిస్తామని వెల్లడి

**వాషింగ్టన్,జూన్19సమయజ్యోతి:** అమెరికాలో చదువుల కోసం ఎదురుచూస్తున్న విదేశీ విద్యార్థులకు అగ్రరాజ్యం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను మళ్లీ ప్రారంభించింది. అయితే, వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తామని వెల్లడించింది. ఈమేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఏడాది మే చివరి వారం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగును తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. వీసా జారీకి అవసరమైన సామాజిక మాధ్యమ ఖాతాల పరిశీలనకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకే వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలోనే తాజాగా సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ల పక్రియను పునరుద్ధరించింది. ఈ సోషల్ మీడియా వెట్టింగ్‌తో తమ దేశంలోకి వచ్చేందుకు ప్రయత్నించే ప్రతి వ్యక్తిని పూర్తిగా పరిశీలించేందుకు వీలు లభిస్తుంది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొ÷ళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. ఉదాహరణకు.. ఎవరైనా విద్యార్థి తమ సామాజిక మాధ్యమ ఖాతాలో పాలస్తీనా జెండాను పోస్ట్ చేసినట్లయితే ఆ వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వారి వల్ల దేశ భద్రతకు ఏ ప్రమాదం లేదని నిర్ధరించుకున్న తర్వాతే వారిని అమెరికా విద్యాసంస్థల్లో చదువుకునేందుకు అనుమతినిస్తారు. అప్పుడే వారికి విద్యార్థి వీసా లభిస్తుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను యూఎస్ కాన్సులర్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమతమ సోషల్ మీడియా ప్రొఫైళ్ల ప్రైవేటు సెట్టింగ్స్‌ను మార్చుకుని 'పబ్లిక్' ఆప్షన్ పెట్టుకోవాలి' అని విదేశాంగ శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

# అత్తింటి వారి కట్న వేధింపులు

## దుర్గం చెరువులో దూకి యువతి ఆత్మహత్య

**హైదరాబాద్,జూన్19సమయజ్యోతి:** నగరంలోని మాదాపూర్ దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మృతిచెందిన యువతిని సుష్మ(27)గా గుర్తించారు. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్టలో సుష్మ నివాసముంటోంది. బుధవారం హైటెక్ సిటీలోని ఆఫీస్‌కి పని నిమిత్తం ఆమె వెళ్లింది. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆఫీస్ మేనేజర్‌కు తండ్రి అంజయ్య కాల్ చేశారు. రాత్రి 10.30 గంటలకే ఆమె బయల్దేరినట్లు మేనేజర్ తెలిపారు. ఈ క్రమంలో హైదరాబాద్ మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువులో ఓ యువతి మృతదేహం లభ్యమైంది. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. పోలీసులు ప్రాథమికంగా ఇది ఆత్మహత్యగా అనుమానిస్తున్నారు. బాధితురాలిని సుష్మ (27)గా గుర్తించారు. ఈ రోజు తెల్లవారు ఝామున 4 గంటలకు బొట్టు అంజయ్య అనే వ్యక్తి మిస్సింగ్ కంప్లైంట్‌ను మాదాపూర్ పోలీసులకు ఇచ్చారు. 'ఆఫీస్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సుష్మ తిరిగి రాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఉదయం 7 గంటలకు దుర్గం చెరువు వద్ద ఒక మృతదేహం కనిపించిందని సమాచారం అందింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. అది మిస్సింగ్ అయిన సుష్మదిగా గుర్తించారు. సుష్మ ఈ ఏడాది జనవరి 31న అమృత్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను వివాహం చేసుకుంది. అమృత్ కూడా ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. సుష్మ తల్లిదండ్రుల ప్రకారం.. పెళ్లి సమయంలో 6 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు, బైక్‌ను కట్నంగా ఇచ్చారు. అయినప్పటికీ సుష్మ అత్త, మామలు అదనపు కట్నం కోసం వేధించారని, ఇటీవల ఆమె శారీరకంగా, మానసికంగా తీవ్రంగా బాధపడుతోందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కొద్దీ రోజులుగా ఆరోగ్యం బాగాలేదని, నేరెడ్‌మేట్‌లోని ఓ హాస్పిటల్‌లో సుష్మను రెండు రోజుల క్రితం వైద్యులకు చూపించినట్లు తల్లిదండ్రులు వెల్లడించారు. అయితే.. బుధవారం ఆమె తిరిగి ఆఫీస్‌కు వెళ్తున్నానంటూ ఇంటి నుంచి వెళ్లిపోయింది. కానీ తిరిగి రాలేదని వారు తెలిపారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో, సుష్మ తన అత్తింటి వారు, భర్త నుంచి ఎదుర్కొంటున్న అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని అనుమానిస్తున్నారు. మాదాపూర్ సీఐ కృష్ణ మోహన్ మీడియాతో మాట్లాడుతూ, 'కేసు నమోదు చేశాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విచారణ కొనసాగుతోంది' అని తెలిపారు. కుమార్తె కనిపించడం లేదంటూ ఉదయం 4 గంటలకు మాదాపూర్ పీఎస్‌లో అంజయ్య ఫిర్యాదు చేశారు. దుర్గంచెరువులో మృతదేహం తేలియాడుతోందని గురువారం ఉదయం 7 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహం సుష్మదిగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# నిధులు జమ కాకుంటే అధికారులను కలవండి

## రైతులకు మంత్రి తుమ్మల సూచన

**హైదరాబాద్,జూన్19సమయజ్యోతి:** రైతు భరోసా నిధులు జమకాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉండి.. బ్యాంకు అంకౌట్లలో డబ్బులు పడని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్తగా భూముల యాజమాన్యం పొందిన రైతులకు కూడా రైతు భరోసాకు అర్హులవుతారని ప్రభుత్వం తెలిపిన విషయం విధితమే. జూన్ 5వ తేదీ వరకు భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులు కూడా ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం పరిగణిస్తుంది. క్రమంలో ప్రభుత్వం నిర్ణయించిన జూన్ 20వ తేదీ వరకు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవాలని భావించిన వారు సంబంధిత ఏఈవో దగ్గరకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందనీ తెలిపారు.. జూన్ 20వ తేదీ వరకు అలా అప్లయ్ చేసుకున్న వారికి మాత్రమే రైతు భరోసా సాయం అందుతుందని అధికారులు తెలిపారు. తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రైతు భరోసా నిధులను విడుదల చేస్తోంది. తాజాగా మరో రూ. 1189.43 కోట్లను విడుదల చేసింది. ఐదు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ చేసిన సర్కార్.. గురువారం నాడు మరికొంత మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసింది. అధికారిక సమాచారం ప్రకారం.. గురువారం నాడు 4,43,167 మంది రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు జమ చేసింది. ఇప్పటి వరకు 62.47 లక్షల మంది రైతుల ఖతాల్లో రూ. 6404.7 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. ఇక భూమి పరంగా చూసుకుంటే.. 106 లక్షల ఎకరాకు పంట సహాయం అందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# రెడ్‌బుక్ తప్ప పేదలను ఆదుకునే చర్యలేవీ

## ఆడపిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలు శూన్యం

## చంద్రబాబు తీరుపై మండిపడ్డ జగన్

**అమరావతి,జూన్19సమయజ్యోతి:** ఎంత సేపు 'రెడ్ బుక్.. రెడ్ బుక్' తప్ప పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదని జగన్ పేర్కొన్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడారు. రామగిరి మండలం ఏడుకుర్రాకులలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను 14 మంది టీడీపీ వాళ్లు సామూహిక అత్యాచారాన్ని చేశారు. కనీసం ఫిర్యాదు కూడా ఇవ్వనీయకుండా భయపెట్టింది నిజం కాదా?. తండ్రి లేని ఆ కుటుంబాన్నీ భయపడితే వాళ్లు ఊరు విడిచి వెళ్లింది నిజం కాదా?. ఆ బాలికకు న్యాయం చేసే దమ్ము చంద్రబాబుకు లేదా?. న్యాయం చేయాలనే సిన్సియారిటి ఆయనకు లేదు. అనంతపురం జిల్లాలో ఇంటర్ చదువుతున్న గిరిజన బాలిక కనిపించటం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆరు రోజుల తర్వాత ఆ పాప శవమై దొరికింది. కుప్పం నియోజకవర్గంలో అప్పు చెల్లించలేదని మహిళను చెట్టుకు కట్టేశారు. ఈ మనిషా ఆడవారి గౌరవం గురించి మాట్లాడేది. ఎంత సేపు రెడ్ బుక్.. రెడ్ బుక్ తప్ప పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన ఏది?' అని వైఎస్ జగన్ మండిపడ్డారు. 'ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అన్నాడు.. సూపర్ సెవెన్ అన్నాడు. ప్రతీ కుటుంబంలో మహిళలు తన సొంత కాళ్ల మీద నిలబడాలి. మహిళలు స్వయంగా వాళ్ళ కాళ్ల మీద వాళ్లు నిలబడాలి అని ఆరాట పడ్డాం. మహిళలకు ఎంతో చేసింది ఒక్క వైసీపీ ప్రభుత్వం మాత్రమే. చట్టం చేసి మరీ 50 శాతం పదవులు మహిళలకు ఇచ్చిన ఘనత జగన్‌దని అన్నారు. ఎవరికి మహిళల మీద గౌరవం ఉంది అని అడుగుతున్నా. మంచి చేసినా మాకా.. ఆ ముసుగులో ఇలాంటి పనులు చేసిన ఆయనకా. మహిళలకు అయినా.. పిల్లను ఇచ్చిన మామకు అయినా వెన్నుపోటు పొడవటంతో ఆయనకు ఆయనే సాటి. ఎన్నికల ముందు జగన్ సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోవు.. ఇంకా మెరుగైన కార్యక్రమాలు చేపట్టి ముందుకు తీసుకెళ్తా అని చెప్పిన చంద్రబాబు.. చూ మంతర్ అంటూ సూపర్ సిక్స్ మొత్తం చేసేసా అని చెబుతున్నారు. ఎవరైనా సూపర్ సిక్స్ అని అడిగితే నీ నాలుక మందం అని బెదిరిస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదికి 36 వేలు ఇస్తామని చెప్పారు.. ఎంత ఇచ్చారు. ఒక్కరికి ఇచ్చిన పాపాన పోలేదు. 18 ఏళ్లు నిండిన మహిళకు ఆడబిడ్డ నిధి ఇస్తామన్నారు.. 2.10 కోట్ల మంది మహిళలు ఓటర్లుగా ఉన్నారు. 60 ఏళ్లు నిండిన వాళ్లను తీసేస్తే 1.80 కోట్ల మంది ఉన్నారు. ఇప్పుడు మళ్ళీ పీ4 అని కొత్త డ్రామా ఆడుతున్నారు. 1.59 కోట్ల మందికి దీపం గ్యాస్ కనెక్షన్స్ ఇవ్వాలి అంటే 4109 కోట్లు ఖర్చు అవుతుంది. దీనికి టికీ ఏడాది బ్జడెట్ కేటాయింపు 860 కోట్లు. మరి చెప్పిన మాటలు మొత్తం మోసం కాదా అని అడుగుతున్నా' అని జగన్ ప్రశ్నించారు. 'మహిళలకు ఉచిత బస్సు అన్నిటికన్నా సులభం. రాష్ట్రంలో మహిళలు మొత్తం ఎదురుచూస్తున్నారు. సంవత్సరం అయ్యింది, పండుగల పేర్లు మారుతున్నాయి. అధ్యయనం కోసం ఎక్కడికో వెళ్ళాల్సిన పనేముంది.. ఆర్టీసీకి డబ్బులు ఇస్తే చాలు. ఎవరికి కావలసిన వాళ్ళు అక్కడకు వెళ్ళి చూసి వస్తారు. 50 ఏళ్లకు పెన్షన్ అన్నారు.. రాష్ట్రంలో 20 లక్షల మంది అర్హులు ఉన్నారు. మొదటి సంవత్సరం ఎవరికీ ఇవ్వలేదు.. రెండవ ఏడాది వచ్చింది. ఇచ్చే పెన్షన్లు కూడా తగ్గించేశారు. ఎన్నికల తర్వాత ఐదు లక్షల పెన్షన్లు తీసేసారు. ఒక్కటి కొత్తది ఇవ్వకపోగా ఐదు లక్షల పెన్షన్లు తీసేసారు.



# ముంబైని ముంచెత్తిన భారీ వర్షం

**ముంబయి,జూన్19సమయజ్యోతి:** మహారాష్ట్ర రాజధాని ముంబయిలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రోడ్లన్నీ జలమయంగా మారాయి. రోడ్లపై నీరు చేరడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఎవరు బయటకు రావడంలేదు. వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. బుధవారం సాయంత్రం నుండి ఇప్పటివరకు 200 మి.మీ. వర్షపాతం నమోదైందని వెల్లడించింది. ముంబయి, పరిసర ప్రాంతాలకు ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాల కురస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమయితే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# ప్రియుడితో హోటల్‌లో భార్య శృంగారం

## భర్త రావడంతో గది నుంచి దూకి పారిపోయిన భార్య

**లక్నో,జూన్19సమయజ్యోతి:**
హోటల్ రూమ్‌లో ప్రియుడితో ఉండగా భర్త రావడంతో భార్య భవనం పైనుంచి కిందికి దూకి పారిపోయింది. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బాగ్‌పత్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బడౌత్ పట్టణంలో శోభిత్ అనే వ్యక్తి తన ప్రియురాలుతో కలిసి హోటల్ రూమ్‌కు వచ్చాడు. అదే సమయంలో హోటల్‌కు భర్త రావడంతో భార్య గమనించింది. హోటల్ భవన పైనుంచి దూకి పారిపోయింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భార్య, ఆమె ప్రియుడితో తనకు ప్రాణహాని ఉందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని భార్యకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఈ దంపతులకు 2019లో వివాహం జరగగా ఒక కుమారుడు ఉన్నాడు.

# తిరుమలలో ఆర్టీసీ ఉచిత బస్సులు

## ప్రారంభించిన టిటిడి అదనపు ఇవో వెంకయ్య చౌదరి





**తిరుమల,జూన్19సమయజ్యోతి:**
తిరుమలలో శ్రీవారి రథాలకు తోడు ఉచితంగా ఆర్టీసీ బస్సులను నడుపనుంది. భక్తులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరవేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచిత సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రి సర్కిల్ వద్ద గురువారం ఆయన జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. తిరుమలలో భక్తుల నుంచి ప్రైవేటు వాహనాల వారు అధికంగా డబ్బులు వసూలు చేయడాన్ని అరికట్టేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు బస్సులను ఉచితంగా తిప్పాలని ఏపీఎస్ ఆర్టీసీని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం.. తిరుమలలో బస్సులను ఉచితంగా నడిపేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషమయన్నారు. ఇందుకు ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలలో శ్రీవారి ధర్మ రథాలు తిరిగే మార్గంలోనే ఆర్టీసీ బస్సులు తిరుగుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తాయని వెల్లడించారు.

వృధా నీటి వినయోగంపై ఎందుకీ రాద్ధాంతం

# కాళేశ్వరానికి నేనెప్పుడైనా అడ్డుపడ్డానా

## ఎపి సిఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి,జూన్19సమయజ్యోతి:**
సముద్రంలో కలిసే వృధా నీటి వాడకంపై సమస్య సృష్టించడం ఎంత వరకు సమంజసమని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. బనకచర్లపై తెలంగాణ వివాదం చేయడం సరికాదని అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుకుంటున్నాయని, పోలవరం తప్ప మిగతావన్నీ అనుమతి రాని ప్రాజెక్టులేనని చెప్పారు.‘మనం మనం కొట్లాడుకుంటే ఎవరికి లాభం? తెలంగాణపై ఎప్పుడైనా గొడవ పడ్డానా? కృష్ణాలో తక్కువ నీటిపై గొడవ పడితే లాభం లేదు. కొత్త ట్రైబ్యునల్ వచ్చాక కేటాయింపుల మేరకు ముందుకెళ్లాలి. ఏపీ, తెలంగాణ ఎవరి శక్తి మేరకు వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుందాం. ఎవరూ ఎవరిపైనా పోరాడాల్సిన అవసరం లేదు. కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. కృష్ణానదిలో మాత్రమే నీళ్లు తక్కువగా ఉన్నాయి.

# పోలీస్ ఆంక్షల ధిక్కరణ.. బారికేడ్ల తొలగింపు

**-పోలీసు విధులకు ఆటంకం కలిగిచిన అంబటి-సత్తెనపల్లి రూరల్ పోలీసుల కేసు నమోదు**

**-రెచ్చగొట్టేలా ప్లకార్డుల ప్రదర్శించిన వారిపైనా కేసు**

**గుంటూరు,జూన్19సమయజ్యోతి:**
వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు పై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా కొర్రపాడు వద్ద అంబటి తన సోదరుడు మురళితో కలిసి పోలీస్ ఆంక్షలను ధిక్కరించారు. బారికేడ్లు తోసేసి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారించిన పోలీసులను కూడా అంబటి నెట్టివేశారు. విధులకు ఆటంకం కలిగించి దాడి చేశారంటూ వివిధ సెక్షన్ల కింద పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. జగన్ బుధవారం సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో వైకాపా కార్యకర్త నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణకు హాజరయ్యారు. ఆయన ర్యాలీ గుంటూరు, నల్లపాడు, మేడికొండూరు మీదుగా పల్నాడు జిల్లా వరకు సాగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల సరిహద్దు ప్రాంతం కొర్రపాడు శివారులోని ఒక పెట్రోల్ బంకు వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటుచేశారు. జగన్ వాహనంతో పాటు మరికొన్ని ముందుకెళ్లగా.. రద్దీని నియంత్రించేందుకు వెనుక ఉన్న వాహనాలను పోలీసులు ఆపారు. మాజీమంత్రి అంబటి రాంబాబు అక్కడికి వచ్చి.. వాహనాలను ఎందుకు ఆపారని, వెంటనే పంపాలని పోలీసులతో వాదనకు దిగారు. వాహనాల సంఖ్య ఎక్కువగా ఉందని, ఏటుకూరు వద్ద ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోయినందున జగన్ కాన్వాయ్‌కు ఇబ్బంది కలగకూడదనే వాహనాల్ని ఆపామని పోలీసులు వివరించినా వినిపించుకోలేదు. పోలీసులతో వాగ్వాదానికి దిగిన అంబటి.. ఓ దశలో తన సోదరుడు మురళితో కలిసి రోడ్డుపై అడ్డుగా పెట్టిన బారికేడ్లు నెట్టేశారు. అడ్డుచెప్పిన పోలీసులపై నోరు పారేసుకుని వారిపైకి దూసుకెళ్లారు. జగన్ రెంటపాళ్ల పర్యటనలో నిబంధనలు ఉల్లంఘించడంపై సత్తెనపల్లి పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. వైకాపా నేత, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సత్తెనపల్లి వైకాపా ఇన్‌ఛార్జ్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డితో పాటు మరికొందరిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే వివాదాస్పద ప్లకార్డులు ప్రదర్శించిన వైకాపా కార్యకర్తను పోలీసులు అరెస్టు చేశారు. పల్నాడు జిల్లా రెంటపాళ్లలో జగన్ పర్యటనలో రవితేజ అనే కార్యకర్త వీటిని ప్రదర్శించాడు. దీంతో 88 తాళ్లూరు గ్రామానికి చెందిన అతడిని అరెస్టు చేశారు. సత్తెనపల్లి తెదేపా నాయకులు, తెలుగు మహిళల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నకరికల్లు పోలీసు స్టేషన్‌లో పోలీసులు రవితేజను ప్రశ్నిస్తున్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం పల్నాడు జిల్లా సత్తెనప్లలె నియోజకవర్గంలోని రెంటపాళ్లకు వెళ్లినప్పుడు వైకాపా శ్రేణులు ప్రజలను భీతావహుల్ని చేసే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ప్లెక్సీలను ప్రదర్శించారు. నినాదాలు చేశారు. జగన్ ఇటీవల రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా వైకాపా శ్రేణులు ఇలాగే చెలరేగిపోతున్నాయి.

# ఏడాది కూటమి పాలనపై పోరాడుతున్నాం

**వైఫల్యాలు, మోసాలతో కూటమి పాలన**

**డైవర్షన్‌లో భాగంగానే నేతలపై కేసులతో వేధింపులు**

**వెన్నపోటు దినంతో నిరసన తెలిపాం**

**కర్ఫ్యూ పరిస్థితుల మధ్య రెంటపాళ్ల పర్యటన**

**బాబుకు వెన్నుపోటు రాజకీయాలు తప్ప మరోటి తెలియవు**

**ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలకు మోసం**

**మ్యానిఫెస్టోపై ఇంటింటికి వెళ్లి ప్రజల ముందే నిలదీస్తాం**

**మీడియా సమావేశంలో జగన్ వెల్లడి**

**అమరావతి,జూన్19సమయజ్యోతి:**
ఏపీలో ఏడాదిగా కూటమి పాలనలో.. టీడీపీ, ఎల్లో మీడియాతో యుద్ధం చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు,పాలన వైఫల్యాలు, మోసాల మధ్య చంద్రబాబు పాలన కొనసాగుతోందన్నారు. గురువారం తాడే పల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాల యంలో జరిగిన మీడియా సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడారు. చంద్రబాబు అరాచక పాలనకు వ్యతిరేకంగా జూన్4న ప్రజలు, వైఎస్సార్‌పీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొని వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేశారు. టీడీపీ నేతలు, పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వర రావు కుటుంబాన్ని పరామర్శించేందుకు రెంటపాళ్ల వెళ్లా. కర్ఫ్యూలాంటి పరిస్థితుల మధ్య నా రెంటపాళ్ల పర్యటన జరిగింది. అయినా విజయవంతమైంది. మా పార్టీ శ్రేణుల్ని పరామర్శిస్తే తప్పా? మొన్నటి పొదిలి పర్యటనలో 40వేల మందిపై రాళ్లేసే ప్రయత్నం చేశారు. రైతులు సంయమనం పాటించారు. అయినా కేసులు పెట్టారు. రైతుల సమస్యల గురించి ఎవరూ మాట్లాడకూడదు. సంఘీభావం తెలప కూడదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎందుకు భయపడు తున్నారు. ఓ టీవీ ఛానెల్‌లో చంద్రబాబు అహంకార మాటలు వినండి. ప్రతిపక్షంను భూస్థాపితం చేస్తారట. ప్రశ్నిస్తున్న వ్యక్తిని భూస్థాపితం చేస్తారా?. ఏడాది కాలంలోనే ఎన్నడూ లేని విధంగా ప్రజల్లో చంద్రబాబు పాలనపై అసహనం పెరిగింది. ఆ అసహనాన్ని డైవర్ట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై, నేతలపై కేసులు పెడుతున్నారు. టాపిక్ డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. మద్యం కేసులో అక్రమ అరెస్టులు జరుగుతున్నాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. చెవిరెడ్డి అరెస్ట్ నిజంగా అశ్చర్యకరం. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని గన్‌మెన్‌ను బలవంతం చేశారు. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వనందుకు గన్‌మెన్‌పై దాడి కూడా చేశారు. తనపై జరిగిన దాడిని గురించి ప్రస్తావిస్తూ రాష్ట్రపతి, గవర్నర్, డీజీపీకి గన్‌మెన్ లేఖ రాశారు. మరో గన్‌మెన్‌ను ప్రలోభాలకు గురిచేసి వారికి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇప్పించుకున్నారు. చెవిరెడ్డితో పాటు ఆయన కొడుకును కేసులో ఇరికించారు. సొంత నియోజవకర్గంలో గెలవలేని వ్యక్తి. చంద్రగిరిలో ఇబ్బంది ఉండకూడదనే చెవిరెడ్డిని అరెస్ట్ చేశారు. తప్పుడు కేసులో పిన్నెల్లిని అరెస్ట్ చేశారు. మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లి బెయిల్ తీసుకొచ్చాం. మళ్లీ తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేశారు. సురేష్ భార్యపైనా కేసులు పెట్టారు. వల్లభనేని వంశీపై 11 కేసులు పెట్టారు. జోగి రమేష్ కొడుకు, కాకాణిపై తప్పుడు కేసులు. కృష్ణమోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిపైనా అక్రమ కేసులు పెట్టారు. కొడాలి నాని, సజ్జల రామకృష్ణారెడ్డి, పేర్నినాని, వైవి సుబ్బారెడ్డి, ఆయన కుమారుడిపై తప్పుడు కేసులు. దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే ఆర్కే,అంబటి రాంబాబు, విడదల రజినిపై తప్పుడు కేసులు దళిత ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పైనా అక్రమ కేసులు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిపై, ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాష్, గోరంట్ల మాధవ్‌పై కేసులు. ఇలా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని చూస్తున్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఏం పాపం చేశారు? ఏం చేశారని కొమ్మినేనిని అరెస్ట్ చేశారు?టీవీ డిబెట్‌లో అనలిస్ట్ మాటలకు కొమ్మినేనికి ఏం సంబంధం? గతంలో కేఎస్ఆర్ ఉద్యోగాన్ని చంద్రబాబు ఊడగొట్టిం చారు. కేఎస్ఆర్ అరెస్ట్ అక్రమమేనన్న సుప్రీంకోర్టు.. తనకున్న విచక్షణాధికారాల్ని ఉపయోగించి ఆయన్ను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలించింది. సుప్రీం కోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని జగన్ అన్నారు. ప్రజల కోసం ఆలోచన చేసిన ప్రభుత్వం మాది. 32లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చాం. 22 లక్షల ఇళ్లను మంజూరు చేసి 10లక్షల ఇళ్లు పూర్తి చేశాం. చట్టం చేసి మరి నామినేటెడ్ పదవుల్లో మహిళలకు అవకాశం కల్పించాం. మహిళలపై ఎవరికి గౌరవం ఉంది?. మహిళలంటే చంద్రబాబుకు గౌరవం లేదు. వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబుకు ఆయనే సాటి అంటూ విమర్శించారు. 5వేల కోట్లు కరెంట్ బిల్లుల బాదుడు,గవర్నమెంట్ స్కూళ్లు కాలేజీ కాలేజీల్ని నిర్వీర్యం చేశాడు. ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో ఫీజుల పేరిట బాదుడే బాదుడే. రేషన్ వెహికల్స్ వాహనాల్ని తీసేశాడు. రేషన్ ద్వారా ఇచ్చే పప్పు దాన్యాల్ని ఎగనామం పెట్టాడు. ఫలితంగా పప్పు దాన్యాల రేట్లు పెంచి బాదుడే బాదుడు. కొత్త ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి.. సుమారు 3లక్షలపై చీలూకు ఉద్యోగాల్ని తొలగించారు. పంటలకు సరైన మద్దతు లేదు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఏమైనా ఒరిగిందా అంటే? అదీ లేదు. వచ్చీ రాగానే పీఆర్సీ అన్నారు. పీఆర్సీని ఆపేశారు. ఈ జులై 1వ తారీఖుతో కలిసి నాలుగు డీఏ ఇవ్వాలి. ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన 20 వేలకోట్ల వరకు ఆపేశారు. చంద్రబాబు తాను అబద్ధమాడుతూ.. తానెప్పుడూ ప్రభుత్వ ఆస్తుల్ని తాకట్టు పెట్టడం లేదన్నాడు. మద్యం ఆదాయం తాకట్టుపెట్టడం లేదు. కానీ 4-4-2025 నాడు విడుదల చేసిన జీవో 69 కింద ఏపీఎండీసీ కి ంద 4 3 6



మినరల్ ప్రాజెక్ట్‌ను తాకట్టు పెట్టారు. వాటి విలువ 191,000 కోట్లు అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను అందరూ రెడీగా పెట్టుకోవాలి. చంద్రబాబు తన పాలన గురించి తెలుసుకునేందుకు మీ ఇంటికి ఎమ్మెల్యేలు, ఇతర నేతల్ని పంపిస్తున్నారు. నేతలు వచ్చినప్పుడు మ్యానిఫెస్టో, బాబష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో బాండును అందించారు. ఆ బాండు, ఎన్నికల మ్యానిఫెస్టో చూపిస్తూ ఎంత వరకు ఎన్నికల హామీలు నెరవేర్చారో అడగండి. అప్పుడైనా చంద్రబాబుకు ఎన్నికల హామీలు నెరవేర్చుతారో చూడాలి. ఒకవేళ మీ వద్ద 'బాబు మ్యానిఫెస్టోని గుర్తు తెచ్చుకుంటూ' అనే పేరుతో చంద్రబాబు మ్యానిఫెస్టోను డౌన్‌లోడ్ చేసుకునేలా క్యూఆర్ కోడ్‌ను వైఎస్సార్‌సీపీ అందుబాటు లోకి తెస్తుంది' అని అన్నారు. ప్రభుత్వంపై ఫైట్ చేయండి. రాష్ట్ర ప్రజల తరుపున వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# రాజకీయాల్లో నేరస్థులను ప్రోత్సహిస్తారా

**రౌడీలు, గూండాలకు విగ్రహాలు పెడతారా**

**యోగాను డైవర్ట్ చేయడానికి ఇంత రౌడీయిజమా**

**నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి**

**చట్టం తనపని తాను చేసుకు పోతుంది**

**మేము ఎక్కడా జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు**

**రఫ్ఫా రఫ్ఫా అంటూ రౌడీయిజం చేస్తామంటే చూస్తూ ఊరుకోవాలా**

**జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు నాయుడు**

**అమరావతి,జూన్19సమయజ్యోతి:**
ఓ వైపు యోగా జరుగుతుంటే.. మరోవైపు వైసీపీ శ్రేణులు రప్పా రప్పా అంటున్నారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. చంపండి.. నరకండి.. అని ఎవరైనా అంటారా అని ప్రశ్నించారు. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లు, రౌడీలకు విగ్రహాలు పెడతారా అని నిలదీశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటన సందర్భంగా అల్లర్లు చోటు చేసుకున్న ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఇరుకు వీధుల్లో మీటింగ్‌లు పెట్టి ప్రజలను ఇబ్బంది పెడతారా అని సీఎం చంద్రబాబు అడిగారు. హింసను ప్రోత్సహించి పోలీసులపై నిందలు మోపుతారా అని ఫైర్ అయ్యారు. ఏపీలో ఎప్పుడైనా ఇలాంటి పోకడలు చూశారా అని ప్రశ్నించారు. నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. తాము ఎవరినీ టార్గెట్ చేయడం లేదు.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. రౌడీయిజం చేసేవారిని, చట్టాన్ని ఉల్లంఘించేవారిని వదిలేయాలా అని నిలదీశారు. ఒక్కసారి ఉన్మాదులుగా మారితే వారిని మార్చగలమా అన్నారు. భవిష్యత్‌ను తీర్చిదిద్దే నాయకుల గురించి ప్రజలు ఆలోచించాలని కోరారు సీఎం చంద్రబాబు. 'కొందరికి క్రైమ్ కూడా అలవాటు అయిపోయింది. అంతా యోగా చేస్తే పబ్లిక్ అటెన్షన్ డైవర్ట్ చేయాలని ఇలాంటివి చేస్తున్నారు. ఇప్పుడు రఫ్ఫా రఫ్ఫా అంటున్నారు. గంగమ్మ జాతరలో పొట్టేలు నరికినట్లుగా నరికేస్తాం అంటున్నారు. ఒకప్పుడు చెడ్డ లక్షణాలు ఉన్న వ్యక్తిని రాజకీయాల్లో దూరం పెట్టేవారు.

## 8గంటలపాటు ప్రభాకర్ రావు విచారణ

**హైదరాబాద్,జూన్19(సమయజ్యోతి):**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సిట్ బృందం నాలుగో సారి సుదీర్ఘంగా ప్రశ్నించింది. ఎవరెవరి ఫోన్లు ఎందుకు ట్యాప్ చేశారన్నదానిపై కూపీ లాగారు. అయితే ప్రభాకర్ రావు సరైన సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది. దాదాపు 8 గంటలుగా ఆయన్ను సిట్ అధికారులు విచారించారు. ప్రధానంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి, మరికొందరు రాజకీయ నేతలు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ప్రభాకర్‌రావును పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ లోతుగా ప్రశ్నించారు. 618 మంది ఫోన్లను ప్రభాకర్‌రావు బృందం ట్యాప్ చేసినట్టు ఇప్పటికే సిట్ గుర్తించింది. బాధితులను పిలిపించి వారి వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేస్తున్నారు. వారిచ్చిన వాంగ్మూలాల ఆధారంగానే సిట్ అధికారులు ప్రభాకర్‌రావును ప్రశ్నించినట్టు సమాచారం. మరో వైపు నిన్న ప్రణీత్‌రావును కూడా సుదీర్ఘంగా ప్రశ్నించిన అధికారులు అతని వాంగ్మూలం ఆధారంగా కూడా ప్రభాకర్‌రావును విచారించినట్టు తెలుస్తోంది. ప్రణీత్‌రావుకు ప్రభాకర్‌రావు ఇచ్చిన ఆదేశాలేంటి? ఎంత మంది ఫోన్లు ట్యాపింగ్ చేయాలని చెప్పారు, ఎవరి ఆదేశాలతో ట్యాపింగ్ వ్యవహారం మొత్తం కొనసాగింది? అనే కోణాల్లో విచారణ సాగింది.

## ఆపరేషన్ కగార్ నిలిపివేయండి

### మాజీ ఎమ్మెల్సీ

### కొండా మురళి డిమాండ్

**వరంగల్,జూన్19(సమయజ్యోతి):**

ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమాయకులను చంపుతోందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ని వెంటనే నిలిపివేయాలని కోరారు. ఓ బీసీ ఉద్యమకారుడిని ఎన్‌కౌంటర్ చేయడం బాధాకరమని అన్నారు. ఆపరేషన్ కగార్‌ని నిలిపివేయాలని ఆందోళనలు చేస్తామంటే పోలీసులు అడ్డుకున్నారని గుర్తుచేశారు. గురువారం వరంగల్ జిల్లాలోని పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఉన్నంత వరకు కార్యకర్తలను కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. బీసీ నాయకుడిని అయినందుకే తనపై కక్షగట్టి అసత్య ప్రచారాలు చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరకాల నియోజకవర్గంలో త్వరలోనే కొండా సుస్మిత పటేల్ రంగ ప్రవేశం చేస్తారని తెలిపారు. కొండా సురేఖ మంత్రి పదవి పోతుందని కొంతమంది ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొండా సురేఖ మంత్రి పదవి ఎక్కడికి పోదని స్పష్టం చేశారు. తమ వెంట సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఉన్నారని కొండా మురళి పేర్కొన్నారు.

## బ్రిడ్జి గుంతలో పడ్డ కారు

### ఇద్దరు మృతి

**కామారెడ్డి,జూన్19(సమయజ్యోతి):**

ఎల్లారెడ్డి మండలం లోని మల్లయ్యపల్లి గ్రామ శివారులో నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా పోచారం కాలువపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి గుంతలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు కారు పడడంతో ఇద్దరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేట మండలం నర్సింగ్ రావు పల్లి తండాకు చెందిన పీరియ (38), డ్రైవర్, పీరియా (32) ప్రమాదంలో అక్కడికక్కడే మృత్యుపాలయ్యారు. సోను, వెన్ను, ప్రవీణ్ లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నర్సింగరావుపల్లి నుంచి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, డ్రైవర్‌తో కలిసిపెద్దగుట్టకు బుధవారం రాత్రి బయలుదేరారు.నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా సదరు కాంట్రాక్టర్ పోచారం కాల్వపై బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. వాహనాల రాకపోకలకు కాలువలో మట్టిని పోసి దారిని చేశారు. కాగా కారు ప్రమాదవశాత్తు పైనుంచి పది ఫీట్లకు పైగా ఉన్న గుంతలో వెల్లకిలో పడింది. కారు కిందపడడంతోనే పై టాప్ ఒత్తుకపోవడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ముగ్గురిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి ప్రభుత్వ అంబులెన్స్‌లో తరలించారు. విషయం తెలిసిన మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలివచ్చారు. గాయపడిన ముగ్గురికి ప్రధమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం మెదక్ జిల్లా కేంద్రం ఆసుపత్రికి కుటుంబీకులు తరలించారు. స్థానిక ఎస్సై బొజ్జ మహేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా ఎస్పీ ముందు

## 12 మావోల లొంగుబాటు

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్19(సమయజ్యోతి):**

జిల్లా పోలీసులు, 81 అండ్ 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధిసంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత సత్ఫలితాలను ఇస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా లొంగిపోయిన సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ కల్పిస్తున్న సదుపాయాలను గురించి తెలుసుకొని నక్సలిజాన్ని విడనాడి ఇకపై తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని, నిర్ణయించుకొని వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న 12 మంది నిషేదిత మావోయిస్టు పార్టీ సభ్యులు గురువారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు వీరితో కలిపి మొత్తం 294 మంది దళ సభ్యులు వివిధ హోదాల్లో డీవీసీఎంలు3, ఏసీఎంలు 17, పీఎంఎస్ 34, మిలీషియం మెంబర్లు 107, పీఆర్‌సీ మెంబర్లు 35, డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ 47, సీఎన్‌ఎం మెంబర్లు 30, జీఆర్‌డీ మెంబర్లు 21 మంది జనజీవన స్రవంతిలో కలిసి తగిన పునరావాస సౌకర్యాలను పొందారు. ప్రస్తుతం సీపీఐ మావోయిస్టు సాయుధ దళాల సంచారం తెలంగాణ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రా ల సరిహద్దు ప్రాంతాల్లో ఉంది. ఈ సరిహద్దు గ్రామాల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో మావోయిస్టు దళాలకు సహకరించకూడదని, మావోయిస్టుల సమాచారం తెలిసినట్లైతే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో కానీ లేదా జిల్లా ఉన్నతాధికారులకు కానీ తెలియజేయాలని, ఇలా ప్రజలు అందించిన సమాచారం ద్వారానే ఇటీవల ములుగు జిల్లాలో 20 మంది సాయుధ దళ సభ్యులను అరెస్టు చేయడం జరిగిందని, 12 ఆయుధాలను కూడా జప్తు చేశారన్నారు. లొంగిపోయిన వారిలో మడకం రమ అలియాస్ మడా అలియాస్ రఘు, మడకం భీమ అలియాస్ శ్రీకాంత్, పున్నం కవిత, ఓయం లక్క అలియాస్ దినేష్, తాటి భీమ, పొడియం దేవి అలియాస్ చిలుక, ముచాకి మాసా అలియాస్ సుధీర్, సోడి హుంగి, కోడి దేవ, మడకం కోసా, మడవి పాండు, సోడి ఊర ఉన్నారు.

## వేగంగా రైతుభరోసా నిధుల బదిలీ

### రైతు ఖాతాల్లో నేరుగా నగదు జమ-62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు

**హైదరాబాద్,జూన్19(సమయజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసాను రికార్డు వేగంతో పంపిణీ చేస్తోంది. కేవలం తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు ఆర్థిక శాఖ ఏ రోజుకారోజు నిధులను విడుదల చేస్తుంది. వ్యవసాయ శాఖ అందించిన జాబితాల ప్రకారం రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తోంది. అయితే, 16వ తేదీన రైతు నేస్తం వేదికగా స్వయంగా సీఎం రైతు భరోసా చెల్లింపులను ప్రారంభించారు. నాలుగు రోజుల్లోనే రికార్డు వేగంతో 6,405 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించింది.

## ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు





దేశం గర్వించే నాయకుడు రాహులు గాంధీ

దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం

రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా ములుగు గట్టమ్మ వద్ద కార్యకర్తలతో కలిసి పూజలు నిర్వహించిన మంత్రి సీతక్క

పూజల అనంతరం పెద్ద ఎత్తున గట్టమ్మ అమ్మవారి దగ్గర నుండి ఇంచెర్ల వరకు సాగిన బైక్ ర్యాలీ

ఇంచెర్ల ఎంఆర్ గార్డెన్ రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కార్యకర్తల మధ్యలో కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

**తెలంగాణ , జూన్ 19, :సమయజ్యోతి**

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు, భావి భారత ప్రధాని, ప్రస్తుత ఎంపి రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) హాజరయ్యారు. ముందుగా ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 3 వేల బైక్లతో ర్యాలీగా ఇంచర్ల ఎంఆర్ గార్డెన్ వరకు చేరుకున్నారు. అనంతరం కార్యకర్తలు నడుమ రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కేకు కట్ చేసి మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణం ఇచ్చిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం అని, భారత దేశ ప్రజలను ఏకం చెయ్యడం కోసం భారత్ జోడో యాత్ర రాహుల్ గాంధీ పాదయాత్ర చెయ్యడం జరిగిందని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సూర్య, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జి సామ రామ్మోహన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, రాష్ట్ర ఇంచార్జి యూత్ కాంగ్రెస్ జలీల్ నేత, కైలాష్ నేత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మల్లాడి రాంరెడ్డి, యువజన, మండల కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలను బలోపేతం చేయడమే ప్రభుత్వం లక్ష్యం





-మహిళలు ఆర్థిక స్వావలంబన చెందాలి

-జగ్గన్నపేట గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో కుట్టు మిషన్లు, ధ్రువపత్రాల పంపిణీ

-రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క

**తెలంగాణ , జూన్ 19, సమయజ్యోతి**

మహిళా సంఘాలను బలోపేతం చేసి వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లాలోని జగ్గన్నపేట గ్రామం ఆశ్రమ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కుట్టు మిషన్ ఉచిత శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్, ధ్రువపత్రాలను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చాలా మంది నైపుణ్యం లేని కారణంగా ఉపాధికి దూరంగా ఉంటున్నారని, దూర ప్రాంతాలకు పనికోసం వెళ్ళి మళ్ళీ ఇంటికి వెనుతిరిగి వస్తున్నారని, ఈ పరిస్థితి దృష్టిలో పెట్టుకొని మహిళలు ఉన్నదగ్గరనే ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో వారికి ఈ కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల అభివృద్ధి కొరకు కట్టుబడి పనిచేస్తున్నదని అన్నారు. వివిధ పాఠశాలల్లో అవసరమైన మేరకు ఏకరూప దుస్తులను మహిళా సంఘాలకు ఆర్డర్ ఇచ్చి వారి ద్వారా విధ్యార్థులకు బట్టలు కుట్టించడం ద్వారా మహిళా సంఘాలకు దాదాపు 30 కోట్ల రూపాయల లాభం వారికి చేకూర్చడం జరిగినదని తెలిపారు. భవిష్యత్తులో రాబోయే విద్యాసంస్థలలోని పిల్లలకు కూడా మహిళా సంఘాల ద్వారానే బట్టలు కుట్టేలా వారికి ఆర్డర్ లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. 15 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు వయస్సున్న మహిళలు అందరూ తప్పకుండా మహిళా సంఘాలలో చేరాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత కొరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, అందులో భాగంగానే మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ లు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, బస్సులు, సోలార్ విద్యుత్తు ఉత్పత్తి అవకాశాలను అందించడం జరుగుతుందని అన్నారు. మహిళలు ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని, తద్వారా తెలంగాణ ప్రగతి పథంలో నడిచేలా మనమంతా ముందడుగు వేద్దామని అభిలషించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళలను ఆర్థికంగా పరిపుష్టం చేసే ఉద్దేశ్యంతో మంత్రివర్యులు ప్రత్యేక చొరవతో జగ్గన్నపేట గ్రామంలో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. నైపుణ్య శిక్షణ ఇవ్వడమే కాకుండా శిక్షణతో పాటు ఉపాధి కల్పించినప్పుడు మాత్రమే అది సార్థకం అవుతుంది. ఇలాంటి ఒక మంచి కార్యక్రమం ఇంతటితోనే ఆగిపోకుండా వివిధ కంపెనీలతో ఒప్పందం చేసుకొని ప్రతిభావంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నెలవారీ ఆదాయం కూడా చేకూరేలా చూసి ఈ కార్యక్రమాన్ని పరిపూర్ణం చేయడం జరుగుతున్నదని, ఇప్పటికే 3 కంపెనీలతో మాట్లాడటం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లా సంక్షేమ అధికారి తుల రవి మాట్లాడుతూ జిల్లాలో మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క చొరవతో జగ్గన్నపేట గ్రామంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ములుగు ఆధ్వర్యంలో డేటా ప్రో సంస్థ శిక్షణ సహకారంతో గత నెల రోజులుగా గ్రామంలోని అర్హులైన 175 మంది మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ అందించడం జరిగినదని అన్నారు. జిల్లా కలెక్టర్ అనునిత్యం మమ్మల్ని వెన్నంటి నడిపి ఈ కార్యక్రమం విజయవంతం చేసేలా ప్రోత్సహించారని అన్నారు. అనంతరం డేటాప్రో సంస్థ నిర్వాహకులు రవీందర్ మాట్లాడుతూ మంత్రివర్యులు సీతక్క ప్రత్యేక చొరవతో ఇంతటి భారీ కార్యక్రమాన్ని చేపట్టి జిల్లా మహిళా సాధికారతా కేంద్రం ములుగు నేతృత్వంలో మా డేటాప్రో సంస్థ ద్వారా విజయవంతముగా ఇట్టి కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇంతటి అవకాశం ఇచ్చినందుకు మంత్రికి, జిల్లా కలెక్టర్ కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మొదటి విడతగా 75 కుట్టు మిషన్ లను మంత్రి అందచేశారు. అనంతరం ఐసిడిఎస్ ములుగు ప్రాజెక్టు సీడీపీఓ శిరీష ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలో చేరిన చిన్నారులకు మంత్రి సీతక్క , కలెక్టర్ లు అక్షరాభ్యాసం చేశారు. పిల్లలు మంత్రి సమక్షంలో ఎంతో ఉల్లాసంగా పాటలు పాడి వినిపించారు. పిల్లల ఉత్సాహాన్ని చూసి మన అంగన్వాడీ పిల్లలు కార్పోరేట్ కు ధీటుగా ఉత్సాహంగా చదవడం ఎంతో సంతోషంగా ఉందని సిబ్బందిని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి తుల రవి, డిఎస్పి రవీందర్, ట్రైబల్ వెల్ఫేర్డిడి పోచం, ఎంపిడి రామక్రిష్ణ, జిల్లా మహిళా సాధికారతా కేంద్రం డిఎంసీ రమాదేవి, డీసీపీఓ ఓంకార్, ఐసీడీఎస్ ములుగు ప్రాజెక్టు పరిధిలోని వివిధ సెక్టార్ల సూపర్వైజర్లు, జిల్లా మహిళా సాధికారతా కేంద్రం, సఖి, డేటాప్రో సంస్థల సిబ్బంది, శిక్షణలో పాల్గొన్న మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పండగల సాగుతున్న వ్యవసాయము

**సాగుకు సమాయత్తం అవుతున్న అన్నదాతలు, ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నిధులతో ఆనందం, గతం కంటే గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణత, అవధులు లేని ఆనందంలో అన్నదాత, జిల్లాలో నేటి వరకు 2,14,347 మంది రైతులకు 243,55,41,698/- రూపాయలను పెట్టుబడి సాయం, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,**

నాగర్ కర్నూల్ ,జూన్ 19, సమయజ్యోతి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ , మాట్లాడుతూ రైతులు వానకాలం సాగుపై నాగర్ కర్నూలు జిల్లాలో పండుగాలా వ్యవసాయ పనులు చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని జిల్లాలో గణనీయంగా పంట విస్తీర్ణత పెరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయానికి అవసరమైనా విత్తనాలు క్రిమిసంహారక మందులను జిల్లా వ్యవసాయ అధికారులు రైతులకు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు ఈ సంవత్సరం వర్షాలు కూడా ముందుగా రావడంతో జిల్లాలో అన్నదాతలు సంతోషదాయకంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత మరోసారి రైతు భరోసా నిధుల విడుదలతో వెల్లడైంది, వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న ఈ సమయంలో రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేలా ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వాన కాలంలో 4 లక్షల 80 వేల ఎకరాల్లో వివిధరకాల పంటలు సాగు చెయ్యగా ప్రస్తుత వానాకాలంలో 5 లక్షల 92 వేల ఎకరాల భూముల్లో వివిధ రకాల పంటల సాగుకు రైతాంగం సిద్ధం చేయడం జరిగిందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ నిధుల ద్వారా విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు అవసరాలకు సంబంధించి రైతులకు మద్దతు లభించనుండటంతో, చాలా మంది రైతులు ముందుగానే అవసరమైన



వ్యవసాయ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ విధంగా విత్తనాల సేకరణకు ముందు రైతులకు రైతు భరోసా నిధులు అందడం ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, అందుకు అనుగుణంగానే జిల్లా యంత్రాంగం రైతులకు పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించేందుకు సంసిద్ధంగా కృషి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

నాగర్ కర్నూల్ జిల్లాలో 2025-26 వానాకాలం సీజన్ కు గాను గురువారం సాయంత్రం వరకు రైతు భరోసా క్రింద ఎకరానికి 6000/-చొప్పున 2,47,112 మంది రైతులకు 243,55,41,698/- రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. జిల్లాలో మిగిలిన రైతులకు మరో వారము రోజులలో విడతల వారిగా ఖాతాలలో డబ్బులు జమ చేయటం జరుగుతుందని, ఇంకా బ్యాంకు అకౌంటు ఎటువంటి తప్పులు వున్నా లేదా కొత్తగా పాస్ బుక్ జారి అయినను అవసరమైన పత్రాలను సంబందిత వ్యవసాయ విస్తరణ అధికారులను మండల వ్యవసాయ అధికారులకు 20వ తేదీ లోపుగా సంప్రదించాలని కోరారు. రైతులు ఎటువంటి అపోహలకు తావివ్వకుండా రైతు భరోసా నిధులు జమ చేసే వరకు వేచి వుండాలని కోరారు.

రైతు భరోసా నిధుల విడుదల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కృతజ్ఞతలు తెలిపారు. సాగులో జాప్యం కాకుండా సకాలంలో సహాయం అందించడం అభినందనీయమని రైతులు పేర్కొన్నారు.రైతు అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కొనసాగిస్తున్న చర్యలు భవిష్యత్తులో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, లాభదాయకంగా మార్చనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజ

నాగర్ కర్నూల్ ,జూన్ 19, సమయజ్యోతి

ఇందిరమ్మ ఇండ్ల ముగ్గు పోయడం జరిగింది లబ్ది దరు బేక్కం లక్ష్మి రాజేందర్... ఇట్టి కార్యక్రమం లో హౌసింగ్ డి ఈ హరి నాయక్ పంచాయతీ కార్యదర్శి, ఏ ఈ నర్సింహా , గ్రామ పంచాయతీ సభవత్ వెంకటేష్ ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు.. మొగిలి నిరంజన్,మాజీ అధ్యక్షులు సురేందర్, కృష్ణ, నరేష్, రాంచదర్, శశిధర్,మల్లేష్, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది



## గత ప్రభుత్వం మైనంపల్లి అనుచరులం పై నిగా పెట్టి ఫోన్ టాంపరింగ్ చేయడం సిగ్గుచేటు


- మైనంపల్లి హనుమంతరావు అనుచరులు గుండా నిరంజన్

మల్కాజిగిరి సమయజ్యోతి 19:





మైనంపల్లి అనుచరులం పై నిగా పెట్టి ఫోన్ ట్యాంపరింగ్ చేయడం అప్పటి ప్రభుత్వం సిగ్గుచేటైన పని అని మైనంపల్లి హనుమంతరావు అనుచరులు గుండా నిరంజన్ అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు ప్రస్తుత మెదక్ ఎమ్మెల్యే రోహిత్ బాబు ఫోన్ టాంపరింగ్ లే కాకుండా ప్రధాన అనుచరులైన కార్పొరేటర్ ప్రేమ్ కుమార్,గుండా నిరంజన్,కపిల్ ల ఫోన్లను ట్యాంపరింగ్ చేసినట్లు అధికారులు నిర్ధారించారు. ఫోన్ టాంపరింగ్ విచారణలు జరుగుతున్న తరుణంలో మైనంపల్లి అనుచరులైన గుండా నిరంజన్ ను బుధవారం ఫోన్ టాపరింగ్ కేసులను దర్యాప్తు చేస్తున్న పోలీసులు విచారించారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న మైనంపల్లి హనుమంతరావు అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే అయితే గత ప్రభుత్వ అప్రజాస్వామికం విధానాల వలన అధికారులు ప్రజా ప్రతినిధులు కూడా నేటి ప్రభుత్వంతో విచారణను ఎదుర్కొంటున్నారు.విచారణ అనంతరం గుండె నిరంజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నేడు ప్రజాపాలన కొనసాగుతుందని గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను,గుట్టుచప్పుడు కాకుండా ఎన్నో అరాచకాలను చేసిందని వాటి అన్నిటిని కూడా రేవంత్ రెడ్డి సర్కారు బయటకి తీస్తుందని తెలిపారు.మైనంపల్లి అనుచరులం పై నిగా పెట్టి ఫోన్ ట్యాంపరింగ్ చేయడం అప్పటి ప్రభుత్వం సిగ్గుచేటైన విధానంగా చెప్పారు.దమ్మున్న నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అని వారి అంచలమైన మా ఫోన్లను కూడా వారి అధికారానికి ఎక్కడ దెబ్బ వస్తుందో అని భయంతో ఇలాంటి చట్ట



## ఆవు జాతి దూడల పశువులకు అన్నిటికీ లంపీ స్కిన్ (ముద్ద చర్మ వ్యాధి) నివారణ టీకాలు వేయించాలని

పశు వైద్యాధికారులు డా. అనిల్, డా. మహేశ్వరీ

నాగర్ కర్నూల్ ,జూన్ 19, సమయజ్యోతి

ప్రతి రైతు తప్పకుండా ఆవు జాతి దూడల పశువులకు అన్నిటికీ లంపీ స్కిన్ (ముద్ద చర్మ వ్యాధి) నివారణ టీకాలు వేయించాలని బల్మూర్ మండల పశు వైద్యాధికారులు డా. అనిల్, డా. మహేశ్వరీ అన్నారు. బల్మూరు మండలం జినుకుంట గ్రామంలో గురువారం పశువులకు ముద్ద చర్మ వ్యాధి, గొంతువాపు, జబ్బ వాపు, నివారణ టీకాలను పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేయడం జరిగింది.డా. అనిల్ మాట్లాడుతు... ఈ వ్యాధితో పశు వులకు జ్వరం సోకడంతో పాటు వాటి చర్మంపై గడ్డలు ఏర్పడడంతో, పశువులు ఆహారం తీసుకోలేవు నోట్లో నుంచి లాలాజలం ఉరి బయట కు రావడం ముక్కు కళ్ళలో నుంచి స్రావాలు రావడం, కొన్నాళ్లకే పశువులు బరువు కోల్పోవడం, పాల దిగుబడి తగ్గిపోతుందని అన్నారు.అసిస్టెంట్ మంజు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## రాయపర్తి మండల గ్రామాల లో పల్లెబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

సి ఆర్ ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధి

తొర్రూర్ జూన్ 19 (సమయజ్యోతి)

పాలకుర్తి నియోజకవర్గం లోని రాయపర్తి మండలంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వి రెడ్డి విస్తృత పర్యటన చేసి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినారు. కిష్టాపురం గ్రామంలో 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పాలకు భూమి పూజ చేసి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. రాయపర్తి మండలంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి గ్రామాల లో అభివృద్ధి కార్యక్రమాలను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మరియు ఊకల గ్రామంలో సిఆర్ఆర్ నిధుల నుంచి పది లక్షల రూపాయలతో నిర్మించబోయే సీసీ రోడ్డు పనులకు భూమి పూజ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.కొండాపురం గ్రామం లో 15 లక్షల రూపాయలతో సి.సి.రోడ్ పనుల కు భూమి పూజ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.మైలారం గ్రామం లో 20 లక్షల రూపాయలతో గ్రామ పంచాయతీ భవనం 20 లక్షల రూపాయలతో సి.సి.రోడ్ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రజా అవసరాలను తీర్చడంలో ముందు ఉంటామని పనులకు మంజూరైన నిధులను ఒక్క రూపాయి దుర్వినియోగం కాకుండా పనులను చేపట్టాలని అధికారులను కోరినారు. ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మా గ్రామాలలో అభివృద్ధి పనులను చేపట్టినందుకు ఎమ్మెల్యేకు అందరూ కృతజ్ఞతలు తెలిపినారు.



## భూ భారతి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఫీల్డ్ విచారణ త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్ కర్నూల్ ,జూన్ 19, సమయజ్యోతి

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు వచ్చిన దరఖాస్తుల ఫీల్డ్ విచారణ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ నూతన ఆర్ ఓ ఆర్ చట్టం భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అదనపు కలెక్టర్ పి అమరేందర్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నేటి వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని అన్నారు. వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని, భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని, అందుకు ఆర్డిఓలు, తాహసిల్దార్లు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డుల మంజూరు, జిల్లాలో అక్రమ ఇసుక రవాణా కాకుండా పకడ్బందీగా అరికట్టాలని ఆర్డీవో లను కలెక్టర్ ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల వారిగా బూతు స్థాయి పోలింగ్ అధికారుల నియామకం, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, తాహసిల్దారు తదితరులు పాల్గొన్నారు






## మెదక్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల రామాయంపేట నందు దరఖాస్తుల ఆహ్వానం

రామాయంపేట సమయజ్యోతి

మెదక్ మహిళ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో రామాయంపేట పట్టణంలో కొనసాగుతున్న నేపథ్యంలో గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కే,శిరీష తెలిపారు.గురువారం,రోజున ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ..బికామ్, సీఏ బికామ్,బిజెడ్ సి,ఎం జెడ్ సి, ఎంఎస్ సి,ఎస్.ఎంపీసీఎస్, కోర్సులలో ప్రవేశాలకు అవకాశం ఉందని,ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 23వ తేదీలోపు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు,నాణ్యమైన భోజనం,ఉచిత పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేస్తున్నామని ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి రోజు భోజనం అందిస్తామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చెందిన ఎస్సీ,ఎస్టి,బిసి విద్యార్థినీలు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకొని డిగ్రీ కళాశాలలో ప్రవేశలు పొందాలని ఆమె సూచించారు.



## నెట్స్‌లో గాయపడిన కరుణ్ నాయర్

### తొలి టెస్ట్‌కు దూరమయ్యే అవకాశాలు

ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ ప్రారంభానికి ముందే టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ కరుణ్ నాయర్ నెట్స్‌లో గాయపడినట్లు తెలుస్తోంది. నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ప్రసిధ్ కృష్ణ వేసిన బంతి కరుణ్ నాయర్‌కు బలంగా తాకినట్లు సమాచారం. దీంతో అతని పక్కటెముకలకు గాయమైందని వార్తలు వస్తున్నాయి. ఈ గాయం ధాటికి అతను ఇబ్బంది పడ్డాడని, ఆ తర్వాత మరోసారి బ్యాటింగ్ చేశాడని తెలుస్తోంది. అయితే గాయం తీవ్రత ఎక్కువైతే అతను తొలి టెస్ట్‌కు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి.ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో టీమిండియాకు కరుణ్ నాయర్ చాలా కీలకం. అతనికి కూడా ఈ సిరీస్ చాలా ముఖ్యం. 8 ఏళ్ల తర్వాత అతను మళ్లీ టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. కరుణ్ నాయర్ చివరిసారిగా 2017లో టెస్ట్ మ్యాచ్ ఆడాడు. ఈ మధ్య దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించిన కరుణ్ నాయర్.. సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో టీమిండియా పిలుపును అందుకున్నాడు.కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవం కూడా ఉండటంతో సెలెక్టర్లు అతనికి అవకాశం ఇచ్చారు. 2023, 2024 కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్లలో నార్తంప్టన్ షైర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 10 మ్యాచ్‌ల్లో 736 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ కూడా ఉంది. రంజీ ట్రోఫీలో విదర్భ తరఫున 16 ఇన్నింగ్స్‌ల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలతో పాటు రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో 8 ఇన్నింగ్స్‌ల్లో 779 పరుగులు చేశాడు.సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ 6 ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో ఐపీఎల్ 2025 సీజన్‌లో కూడా అవకాశం అందుకున్న కరుణ్ నాయర్.. మెరుగైన ప్రదర్శన చేశాడు. ఇంగ్లండ్ పర్యటనలో భారత్-ఏ తరఫున ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో డబుల్ సెంచరీ సాధించి సూపర్ జోష్‌లో ఉన్నాడు. లీడ్స్ వేదికగా శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌లో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేయాలంటే.. కరుణ్ నాయర్ ఆడటం కీలకం. ఈ క్రమంలోనే అతని గాయం వార్తలు అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

## బెన్ స్టోక్స్ పునరాగమనం

### తొలి టెస్టుకు

### ఇంగ్లాండ్ జట్టు ప్రకటన

ఇండియాతో ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్టుకు ప్లేయింగ్ లెవన్ ను అనౌన్స్ చేసింది. మ్యాచ్ కు రెండు రోజులు ముందుగానే తుది జట్టును ప్రకటించి, ముందంజలో నిలిచింది. అందరి అంచనాలకు తగినట్లుగానే ఈ తుదిజట్టు ఉండటం విశేషం. ఇక రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ చాలా కాలం తర్వాత పునరాగమనం చేశాడు. అతను రావడంతో జట్టులో సమతూకం వచ్చింది. ఇక జట్టు విషయానికొస్తే ఓపెనర్లుగా విధ్వంసక ప్లేయర్లు జాక్ క్రాలీ, బెన్ డకెట్ ఆడతారు. వీరిద్దరూ ఇటివల సూపర్ ఫామ్ లో ఉన్నారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన నాలుగు రోజుల టెస్టులో మంచి భాగస్వామ్యాలతో మ్యాచ్ ను మలుపు తిప్పారు. ముఖ్యంగా డకెట్.. అటు వైట్ బాల్ తో పాటు, ఇటు రెడ్ బాల్ తో నూ ఆకట్టుకుంటున్నాడు. క్రాలీ కూడా పెద్ద ఇన్నింగ్స్ ఆడతాడనే తన పేరును నిలబెట్టుకుంటున్నారు. వీరిద్దరూ ఓపెనింగ్ లో మంచి భాగస్వామ్యం అందించాలని టీమ్ మేనేజ్మెంటో కోరుకొంటోంది. నెం.3లో ఒల్లీ పోప్, ఆ తర్వాత వరుసగా మాజీ కెప్టెన్ జో రూట్, హేరీ బ్రూక్, బెన్ స్టోక్స్, జామీ స్మిత్ బరిలోకి దిగుతారు. నిజానికి నెం.3లో ఆర్సీబీ స్టార్ జాకబ్ బెతెల్ కు అవకాశం కల్పించాలని భావించినా, అనుభవానికి పెద్ద పీట వేస్తూ, పోప్ ను ఆడిస్తున్నారు. ఇక నాలుగో నెంబర్లో దిగ్గజ ప్లేయర్ రూట్ ఆడుతున్నాడు. తను కూడా సూపర్ ఫామ్ లో ఉన్నాడు. గతనెలలో జింబాబ్వేపై మంచి ప్రదర్శన కనబర్చాడు. ఆ తర్వాత బ్రూక్ కూడా సత్తా చాటాలని భావిస్తున్నాడు. టెస్టులను కూడా టీ20 తరహాలో ఆడే బ్రూక్.. సొంతగడ్డపై తన పదును చూపించాలని భావిస్తున్నాడు. స్టోక్స్ తిరిగి రావడంతో అటు మిడిలార్డర్ బ్యాటర్ గానూ, ఇటు ఐదో బౌలర్ గానూ సేవలందించగలడు. తన రాక ఇంగ్లాండ్ కి ఎంతో పెద్ద ప్లస్ పాయింట్. ఆ తర్వాత జేమీ స్మిత్ ..వికెట్ కీపర్ బ్యాటర్ గా సేవలందించనున్నాడు. వైట్ బాల్ క్రికెట్లో డకెట్ తో కలిసి ఓపెనింగ్ చేసిన స్మిత్.. టెస్టుల్లో మాత్రం ఏడో స్థానంలో బరిలోకి దిగుతాడు. ఇక ఆల్ రౌండర్ క్రిస్ వోక్స్ అందుబాటులోకి రావడంతో బ్యాటింగ్ లో డెప్త్ పెరిగింది. గాయం కారణంగా డిసెంబర్ నుంచి ఆటకు దూరమైన వోక్స్ తిరిగి జట్టులోకి వచ్చాడు. పేసర్లుగా బ్రైడెన్ కార్స్, జోష్ టంగ్ బరిలోకి దిగుతారు. ఇక ఏకైక స్పిన్నర్ గా షోయబ్ బషీర్ ఆడతాడు. గాయాలతో రెగ్యులర్ పేసర్లు జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్ దూరం కావడం ఇంగ్లాండ్ కు కాస్త మైనస్ పాయింట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు.





## గిల్‌క్రిస్ట్ వివాదాస్పద వ్యాఖ్యలు

### మాపణలు చెప్పాలని సోషల్ మీడియాలో డిమాండ్

టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. జైస్వాల్‌ను కుక్కతో పోల్చాడు. ఈ వ్యాఖ్యలపై భారత అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని జైస్వాల్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. యశస్వి జైస్వాల్ ఆటతీరును కొనియాడుతూ గిల్‌క్రిస్ట్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు టీమిండియా వెళ్లిన విషయం తెలిసిందే. శుక్రవారం నుంచి లీడ్స్ వేదికగా మొదలయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌తో డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్‌కు కూడా తెరలేవనుంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమిండియా ఈ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌ను ఉద్దేశించి మాట్లాడిన ఆడమ్ గిల్‌క్రిస్ట్.. యశస్వి జైస్వాల్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు.ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియాకు జైస్వాల్ కీలకంగా మారుతాడని, అతను టీమిండియా తదుపరి స్టార్ అని కొనియాడాడు. అయితే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా మిచెల్ స్టార్క్‌తో జైస్వాకు జరిగిన మాటల యుద్దాన్ని ప్రస్తావిస్తూ 'ప్రతీ కుక్కకూ ఓ రోజు వస్తుంది'అనే సామెతను ఉపయోగించాడు. ఆ రోజు స్టార్క్‌పై జైస్వాల్ పైచేయి సాధించి అద్భుతంగా ఆడాడని, అది అతని రోజని గిల్‌క్రిస్ట్ చెప్పుకొచ్చాడు.యశస్వి జైస్వాల్.. టీమిండియా తదుపరి సూపర్ స్టార్. విదేశాల్లో ఎలా ఆడాలో భారత ఆటగాళ్లకు చూపించాడు. ఓవర్‌సీస్ కండిషన్స్‌లో అతను ఇంకాస్త మెరుగైన ప్రదర్శన చేయాలి. క్రీజులో ఎక్కువ సమయం గడపాలి. ఓపికగా బ్యాటింగ్ చేయాలి. ఇంగ్లండ్ పర్యటనలో మెరుగ్గా రాణిస్తాడని ఆశిస్తున్నా. ఆస్ట్రేలియా పర్యటనలో స్టార్క్-జైస్వాల్ మధ్య నెలకొన్న వివాదం క్రికెట్ పరంగా మంచిదే. ఆటలో ఇలాంటి ఘటనలు సహజం. ప్రతీ కుక్కకూ ఒక రోజు వస్తుంది. ఆ రోజు జైస్వాల్‌ది. అందుకే ఆ రోజు స్టార్క్‌తో పాటు ఆసీస్‌పై అతను ఆధిపత్యం చెలాయించాడు. ఆ తర్వాతి మ్యాచ్‌ల్లో స్టార్క్ పుంజుకొని యశస్వి జైస్వాల్‌ను ఔట్ చేశాడు. భవిష్యత్తులో జైస్వాల్ మరింత మెరుగవుతాడు. అతని బ్యాటింగ్ మెరుపులే.. అతను ఎంత ప్రతిభావంతుడనే విషయాన్ని తెలియజేస్తాయి.'అని గిల్ క్రిస్ట్ చెప్పుకొచ్చాడు.జైస్వాల్‌పై గిల్ క్రిస్ట్ ప్రశంసల జల్లు కురిపించినా.. 'ప్రతి కుక్కకూ ఒక రోజు వస్తుంది'అనే ప్రతికూల సామెతను ఉపయోగించాడు. ఎందుకంటే ఈ సామెతను సాధారణంగా ఎవరికైనా ఒక్కసారి విజయం దక్కిందని, అది ఎప్పుడూ ఉండదని సూచించడానికి ఉపయోగిస్తారు. ఈ క్రమంలోనే గిల్‌క్రిస్ట్‌పై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## చరిత్ర సృష్టించిన దివ్య దేశ్‌ముఖ్


### బ్లిట్జ్ సెమీఫైనల్స్ లో సంచలన విజయం



భారత యువ గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ చరిత్రసృష్టించింది. లండన్ వేదికగా జరుగుతున్న ఫిడే వరల్డ్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టీమ్ ఛాంపియన్‌షిప్ 2025లో సంచలన విజయం సాధించింది. గురువారం జరిగిన బ్లిట్జ్ సెమీఫైనల్స్ రెండో లెగ్‌లో దివ్య దేశ్‌ముఖ్ వరల్డ్ నెంబర్ వన్ మహిళా చెస్ ప్లేయర్ హౌ యిఫాన్(చైనా)ను ఓడించింది. ఈ గెలుపుతో భారత చెస్ చరిత్రలో ఈ ఘనతను అందుకున్న ప్లేయర్‌గా నిలిచింది. మొదటి లెగ్‌లో దివ్య యిఫాన్ చేతిలో ఓడిపోయినప్పటికీ, రెండవ లెగ్‌లో తెల్ల పావులతో అద్భుత విజయాన్నందుకుంది.ఈ ఛాంపియన్‌షిప్‌లో దివ్య ప్రాతినిధ్యం వహించిన టీమ్ ర్యాపిడ్ విభాగంలో రెండో స్థానంలో.. బ్లిట్జ్ విభాగంలో మూడో స్థానంలో నిలిచింది. వ్యక్తిగతంగా బ్లిట్జ్ ఫార్మాట్‌లో దివ్య ఆడిన ఎనిమిది గేమ్‌లలో ఆరు గెలిచి, ఒక డ్రా చేసుకుని, ఒకే ఒక ఓటమిని చవిచూసింది. హెక్సామైండ్ చెస్ క్లబ్ తరఫున దివ్యా పోటీ చేయగా.. హౌ యిఫాన్ డబ్ల్యూఆర్ చెస్ టీమ్ తరఫున బరిలోకి దిగింది. తాజా విజయంతో దివ్య దేశ్‌ముఖ్‌పై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఎక్స్ వేదికగా దివ్యను అభినందించారు. ఆమె విజయం ధైర్యానికి, పట్టుదలకు నిదర్శనమని, యువ చెస్ క్రీడాకారులకు ప్రేరణనిస్తుందని ట్వీట్ చేశారు. నాగ్‌పూర్‌కు చెందిన దివ్య దేశ్‌ముఖ్, అంతర్జాతీయ మాస్టర్ (%×వీ%), ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ (%ఔ+వీ%) టైటిల్స్ గెలిచింది. ఆమె ఇప్పటికే ఒలింపియాడ్, ఆసియా ఛాంపియన్‌షిప్, వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌షిప్స్‌లో పతకాలను సాధించింది.19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్.. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జన్మించింది. ఆమె తల్లిదండ్రులు జితేంద్ర దేశ్‌ముఖ్, నమ్రత దేశ్‌ముఖ్‌లు వైద్యులు. చిన్న వయసులోనే చెస్ పట్ల ఆసక్తి కనబరిచిన దివ్య, ఐదేళ్ల వయసులోనే ప్రాక్టీస్ మొదలుపెట్టింది. ఆమె తండ్రి నుంచి చెస్ ఓనమాలు నేర్చుకుంది.2020లో జరిగిన ఫిడే ఆన్‌లైన్ చెస్ ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన భారత జట్టులో దివ్య దేశ్‌ముఖ్ ఓ సభ్యురాలు. 2021లో భారత్ నుంచి 22వ ఉమెన్ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు సాధించింది. 2022లో మహిళల ఇండియన్ చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. 2022 చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. 2023లో కజకిస్తాన్‌లోని అల్మాటిలో జరిగిన ఆసియా మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. 2024లో మహిళల అండర్-20 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ను (వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌షిప్) గెలుచుకుంది.

# పెద్ది సినిమా నుంచి మరో లుక్ విడుదల

రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'పెద్ది'. ఇప్పటికే భారీ హైప్‌ను సెట్ చేసుకున్న ఈ ప్రాజెక్ట్ లో చాలామంది క్రేజీ స్టార్‌లు భాగమవుతున్నారు. వారిలో ఓటిటిలో సంచలనంగా నిలిచిన 'మిర్జాపూర్' సిరీస్ ఫేమ్.. మున్నా భయ్యా అంటేనే గుర్తుకు వచ్చే దివ్యేంద్ర శర్మ కూడా ఉన్నారు. ఈ సినిమాలో దివ్యేంద్ర శర్మ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇటీవల విడుదలైన అతడి ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన రాబట్టింది. తాజాగా మేకర్స్ మున్నా భయ్యా పుట్టినరోజు సందర్భంగా మరో స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో దివ్యేంద్ర క్రికెట్ బాల్ పట్టుకుని మాస్ లుక్‌లో పవర్‌ఫుల్ అవతారంలో కనిపిస్తున్నాడు. కాగా అతను ఈ సినిమాలో 'రామ్ బుజ్జి' అనే పాత్రలో కనిపించనున్నారని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికి ఈ పోస్టర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతుండగా ఫ్యాన్స్‌లో హైప్ పెంచేస్తోంది. ఈ భారీ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న గ్రాండ్‌గా




## రైతు కూడబెట్టిన 2లక్షల బుగ్గిపై ప్రస్తావన

### కుబేర ప్రమోషన్లలో శేఖర్ కమ్ముల

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం కుబేర. తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా వైడ్‌గా ఈ చిత్రం జూన్ 20న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు దర్శకుడు శేఖర్ కమ్ముల. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన 2021లో జరిగిన ఒక సంఘటన గురించి పంచుకున్నాడు. కూతురి పెళ్లి కోసం ఒక రైతు 2 లక్షలు దాచుకోగా.. ఆ డబ్బు మంటల్లో కాలిపోతే శేఖర్ కమ్ముల అతడికి ఆర్థిక సహాయాన్ని అందించాడు. విషయం గురించి తాజాగా మాట్లాడుతూ.. కూతురి పెళ్లి కోసం ఓ రైతు దాచుకున్న డబ్బు కాలిపోయిందని తెలిసి నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎంతో కష్టపడి సంపాదించిన ఆ డబ్బు అలా కాలిపోవడం నన్ను తీవ్రంగా కలిచివేసింది. బాగా డబ్బున్నవాడికి నోట్ల కట్టలు మంటల్లో కాలిపోతే కేవలం బాధేస్తుంది, అలాంటిది ఒక పేద రైతు కష్టపడి సంపాదించిన డబ్బు అలా కాలిపోతే అతడి బాధేంటే అర్థం చేసుకోనవసరం లేదు. అతడి కష్టం ఇలా వృథా అవ్వడం నా మనసును బాగా కదిలించింది. అందుకే ఆ రైతుకు నా వంతు సహాయంగా రూ.2లక్షలు పంపించాను. అంటూ శేఖర్ చెప్పుకోచ్చాడు. అసలు ఏం జరిగిందంటే.. 2021లో సూర్యాపేట జిల్లా, మునగాల మండలం, నేలమర్రికి చెందిన కప్పల లక్ష్మయ్య అనే రైతు పూరిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఈ ఘటనలో ఆయన తన కూతురు పెళ్లి కోసం బీరువాలో దాచుకున్న 2 లక్షల రూపాయల నగదు మంటల్లో కాలిపోయాయి. అయితే ఈ విషయం తెలుసుకున్న దర్శకుడు శేఖర్ కమ్ముల చలించిపోయారు. వెంటనే స్పందించి, లక్ష్మయ్య కుటుంబానికి అండగా నిలిచారు. నేరుగా రైతు బ్యాంక్ ఖాతాకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని పంపించారు. అంతేకాకుండా, లక్ష్మయ్య కుటుంబంతో స్వయంగా మాట్లాడి, అవసరమైతే మరింత సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## నేరుగా ఓటిటిలోకి ఉప్పుకప్పురంబు

ఇండస్ట్రీలో కొన్ని కలయికలను అసలు ఎవరూ ఊహించలేం. అలాంటి కలయికల్లో ఒకటి సుహాస్, కీర్తి సురేష్ . వీరిద్దరి కాంబోలో 'ఉప్పు కప్పురంబు' అనే సినిమా తేరకెక్కిన్న సంగతి తెలిసిందే. అని. ఐ. వి శశి దర్శకత్వంలో ఈ సినిమాకు వసంత్ మరళీ కృష్ణ కథ అందించగా, ఎల్లనార్ ఫిల్మ్స్ ప్రై. లి బ్యానర్ పై రాధికా లావు నిర్మిస్తున్నారు. 90ల బ్యాక్ డ్రాప్ లో రూపొందిన ఈ సినిమాలో సెటైర్, కామెడీతో పాటూ ఓ సామాజిక సమస్య గురించి కూడా ప్రస్తావించినట్టు మేకర్స్ తెలిపారు. ఈ సినిమా ఆహ్లాదకరంగా, సెటైరికల్ గా ఉంటూనే ఆడియన్స్ ను ఎంతో ఆలోచింపచేసేదిగా ఉండనుందట. కాగా ఈ చిత్రం థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ కానుంది. ఇప్పటికే ఓటీటీ రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేశారు మేకర్స్ .. 'ఉప్పు కప్పురంబు' సినిమా జులై 4 నుంచి ప్రపంచ వ్యాప్తంగా 240కు పైగా దేశాల్లో ప్రైమ్ వీడియోలో స్పెషల్ గా ప్రీమియర్ కానున్నట్టు తెలిపారు. తెలుగులో రిలీజ్ కానున్న ఈ సినిమా తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో డబ్బింగ్ తో అందుబాటులోకి రానుంది. అయితే ఇప్పటికే టీజర్ ఆకట్టుకోగా..తాజాగా ఈ మూవీ ట్రైలర్ కూడా రిలీజ్ చేశారు. కాగా ట్రైలర్ గనుక పరిశీలిస్తే.. ఊరి స్మశానంలో ఇంకా కేవలం నలుగురికి మాత్రమో చోటు ఉంటుంది. ఊరి పెద్దగా అధికారంలోకి వచ్చిన కీర్తి సురేష్ దాని ఎలా సాల్వ్ చేసింది? అనేది స్టోరి. కాగా విలేజ్ డ్రాప్ లో పూర్తి ఎంటర్ ట్రైనింగ్ మూవీ గా వస్తున్న ఈ మూవీలో కీర్తి లుక్ మొత్తం మార్చేసింది. చాలా రోజులకు బాబుమోహన్ మంచి కం బ్యాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సుహాస్ కూడా మంచి కామెడీ టైమింగ్ తో ఆకట్టుకున్నారు. టోటల్ గా ట్రైలర్ మాత్రం కాస్త కన్ఫ్యూజన్ గాను ఇటు ఎంట్టంల్గ÷నింగ్ గాను ఆకట్టుకుంది.



## నేడు కుబేర మూవీ విడుదల

### ఎపిలో టిక్కెట్ల పెంపుపకు అనుమతి

నాగార్జున, ధనుష్, రష్మిక కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' శేఖర్ కమ్ముల దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 20న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో రూ.75 వరకూ పెంచుకునే వెసులుబాటు కల్పించింది. సినిమా విడుదలైన తేదీ నుంచి 10 రోజుల పాటు ఈ ధరలు అమల్లో ఉండనున్నాయి. మరోవైపు తెలంగాణలో మాత్రం టికెట్ ధరల విషయంలో ఎలాంటి మార్పు లేదు. ఈ విషయమై చిత్ర బృందం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోలేదని సమాచారం. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో టికెట్ ధరలు యథాతథంగా ఉండనున్నాయి ఇక 'కుబేర' మూవీ రన్‌టైమ్ అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. సెన్సార్‌బోర్డు ఈ మూవీకి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. బోర్డు సూచనల మేరకు మార్పు చేర్పులు చేసిన తర్వాత 182 నిమిషాల 38 సెకన్ల నిడివితో 'కుబేర' థియేటర్స్‌లో విడుదల కానుంది. అంటే 3 గంటల 2 నిమిషాలకు పైనే మూవీ రన్‌టైమ్ ఉండటం గమనార్హం. ఇప్పటివరకూ అగ్ర కథానాయకులు, భారీ విజువల్ ఎఫెక్ట్స్ కలిగిన చిత్రాలు మాత్రమే 3 గంటలకు పైన ఉన్నాయి. సోషల్ డ్రామా ఈ స్థాయిలో రన్‌టైమ్ కలిగి ఉండటం సినిమా కంటెంట్‌పై టీమ్‌కు ఉన్న నమ్మకాన్ని చెప్పకనే చెబుతోంది. మూడు గంటల పాటు శేఖర్ కమ్ముల ఏం చెప్పబోతున్నారా? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలాగే తెలుగు, తమిళ వెర్షన్ రన్‌టైమ్‌లో స్వల్ప మార్పు ఉంది. తెలుగులో ఒక నిమిషం నిడివి తక్కువతో థియేటర్‌లో ప్రదర్శితం కానుంది. ఈ విషయాన్ని స్వయంగా దర్శకుడు శేఖర్ కమ్ముల వెల్లడించారు. సాంకేతికంగా ఏర్పడిన సమస్య కారణంగా అలా కట్ చేయాల్సి వచ్చిందని, ఈ మార్పు కథపరంగా ఎలాంటి ప్రభావం చూపదని తెలిపారు.




## 8 వసంతాలతో లక్

### పరీక్షించుకోనున్న కేరళ కుట్టి

మలయాళ ఇండస్ట్రీ నుండి ఎంతో మంది ముద్దుగుమ్మలు టాలీవుడ్‌లో తమ లక్ పరీక్షించుకునేందుకు వస్తుంటారు. అలా వచ్చిన మరో ముద్దుగుమ్మ అనంతిక సనిల్ కుమార్. 15 ఏళ్లకే యాక్టింగ్ కెరీర్‌లోకి అడుగుపెట్టింది ఈ కేరళ కుట్టీ. బేసికల్లీ క్లాసిక్ డ్యాన్సర్. యాక్టింగ్ పై ప్యాషన్‌తో నటనవైపు అడుగులేసిన అనంతిక రాజమండ్రి రోజ్ మిల్క్ చిత్రంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది. మ్యాడ్‌లో నార్నే నితిన్‌కు జోడీగా నటించి బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. కానీ ఆ ఆనందాన్ని మిగల్చేదు తమిళ ఇండస్ట్రీ. కోలీవుడ్‌లో నటించిన రెండు చిత్రాలు రైడ్, లాల్ సలామ్ బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడ్డాయి. దీంతో కెరీర్ డైలామాలో పడిపోతున్న టైంలో వచ్చిందే 8 వసంతాలు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 8 వసంతాలు మరికొన్ని గంటల్లో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించబోతోంది. పొయెటిక్, ఫీల్ గుడ్ మూవీగా తీసుకు వస్తున్న ఈ సినిమా కథ ఆమె చుట్టూనే తిరుగుతోంది. అయితే కుబేరకు పోటీగా రాబోతుంది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685